గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GTV GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సి ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GTV GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 229, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, శుక్రవారం - 27 - సెప్టెంబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఆ దేశాలపై అణుదాడి చేస్తాం.. బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లు వాడితే..

కొత్త అణు సిద్ధాంతం ప్రకటించిన పుతిన్

రష్యాతో పాటు మిత్రదేశమైన బెలారస్‌పై కూడా దాడి జరిగితే తిప్పికొడుతాం



2

## దేశ ఆర్థిక రాజధాని ముంబై అతలాకుతలం

ముంబైని అతలాకుతలం చేసిన వాన..

థానేలో విరిగిపడిన కొండచరియలు

వరదలో కొట్టుకుపోయిన వాహనాలు

14 విమానాల దారి మళ్లింపు



2

## ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీకి జెడ్ కేటగిరీ భద్రత

సీఎం కాన్వాయ్‌లో పైలట్‌తో సహా పోలీసు సిబ్బందితో భద్రత

ప్రోటోకాల్ ప్రకారం ఢిల్లీ సీఎం జెడ్ కేటగిరీకి అర్హులు

షిఫ్ట్‌ల వారీగా పని చేయనున్న 22 మంది సిబ్బంది



2

## ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా?



2లో

ప్రభుత్వానికి దమ్ముంటే పర్మిషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

హైడ్రా బాధితులకు అండగా ఉంటాం... అక్కడకు రండి

హైడ్రా బాధితులకు బీఆర్ఎస్, పార్టీ న్యాయవిభాగం అండగా ఉంటుంది

# నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో సమీక్ష
- దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశం
- డబుల్ బెడ్‌రూం ఇళ్ళను లబ్ధిదారులకు అప్పగించాలని సూచన



హైదరాబాద్: నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులకు వాటిని అప్పగించాలని సూచించారు.

### బీసీ కులగణన వేగంగా పూర్తి చేయాలి

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. బీసీ కులగణన ప్రక్రియపై సమగ్ర అధ్యయనం అవసరమని ఈ సందర్భంగా సీఎం అన్నారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని బీసీ కమిషన్‌ను ఆదేశించారు. బీసీ కులగణను ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలన్నారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలకు వెళ్లి విధివిధానాలను పరిశీలించాలని సూచించారు. బీసీ కులగణనను త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. రాష్ట్రంలో బీసీ కులగణనకు అనుసరించాల్సిన విధివిధానాలపై సీఎంతో కమిషన్ సభ్యులు చర్చించారు.


## మూసీ రివర్ బెడ్ లో సర్వే




2లో


- మూసీ ఆక్రమణలపై హైడ్రా చూపు...
- అధికారులతో రంగనాథ్ సమీక్ష
- నది పరీవాహక ప్రాంతాల్లో అధికారుల సర్వే
- నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని సీఎం హామీ
- సుమారు 1600 ఇళ్లను గుర్తించిన అధికారులు

## ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారు?.. ఈడీకి సుప్రీం కోర్టు మందలింపు



న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సస్పెండ్ అయిన సివిల్ సర్వెంట్ సౌమ్య చౌరాసియాకు ఆమె కస్టడీలో గడిపిన సమయం, ఆరోపణలు నమోదు చేయకపోవడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సుప్రీంకోర్టు (గురువారం) మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అలాగే విచారణలో ఉన్నవారిని ఎన్నాళ్లు జైలులో ఉంచుతారని ఈడీని సుప్రీం కోర్టు ప్రశ్నించింది ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్ మాజీ డిప్యూటీ సెక్రటరీగా చౌరాసియా పనిచేశారు. బొగ్గు కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమె నిందితురాలు. సుప్రీం న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపాంకర్ దత్తా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం సౌమ్య చౌరాసియాకు బెయిల్ మంజూరు చేసింది. ఆమె ఇప్పటికే ఒక సంవత్సరం తొమ్మిది నెలల పాటు కస్టడీలో ఉన్నారని, ఆమె సహ నిందితుల్లో కొందరు ఇప్పటికే మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యారని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ట్రయల్ కోర్టుకు హాజరుకాక పోవడం, మిగతా..2లో

## తిరుమల వడ్డీకాసులవాడికి రూ. 3.50 కోట్లు ఆదాయం



తిరుమల : కలియుగ ప్రత్యక్షదైవంగా కొలువబడుతున్న వేంకటేశ్వరస్వామికి భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 6 కంపార్టుమెంట్లు నిండిపోగా టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 77,939 మంది భక్తులు దర్శించుకోగా 22,668 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.50 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు.

# ప్రధాని మోదీ ముందు చెస్ చాంపియన్స్ గేమ్

- స్వర్ణాలు గెలిచిన భారత బృందానికి ఆలిండియా చెస్ సమాఖ్య రూ.3.2 కోట్ల భారీ నజరానా
- ఆటగాళ్లకు రూ. 25 లక్షలు, పురుషుల, మహిళల జట్టు కోచ్‌లు అయిన అభిజిత్ కుంటె, శ్రీనాథ్ నారాయణన్‌కు తలా రూ.15 లక్షలు పంచనున్నారు



2లో

ఢిల్లీ: ఇటీవల బుడాపెస్ట్ వేదికగా 45వ చెస్ ఒలింపియాడ్ ముగిసిన విషయం తెలిసిందే. ఇందులో ఓపెన్, మహిళల విభాగాల్లో భారత యువ చెస్ క్రీడాకారులు చారిత్రాత్మక విజయాలు అందుకున్నారు. భారత బృందానికి చీఫ్‌గా వ్యవహరించిన దివ్యేందు బరువకు రూ.10 లక్షలు, అసిస్టెంట్ కోచ్‌లలో ఒక్కొక్కరికి రూ. 7.5 లక్షలు మిగతా..2లో

## విశాఖలో దంచికొడుతున్న వర్షం

పలుచోట్ల కుండపోత వర్షం

మరోవైపు.. బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం



విశాఖపట్నం: విశాఖ నగరంలో పలుచోట్ల కుండపోత వర్షం కురుస్తోంది. అల్ప పీడనం బలహీనపడినప్పటికీ నగరంలో భారీ కురుస్తోంది. దీంతో, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్ల మీద వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు.. బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఇదే సమయంలో నేడు, రేపు ఉత్తరాంధ్రలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. దక్షిణ కోస్తాలో కూడా పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే చాన్స్ ఉంది. తీరం వెంబడి బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దనే హెచ్చరికలు కొనసాగుతున్నాయి.

# నామినేటెడ్ పదవులపై ఆశలు




- పైకి అంతా బాగున్నట్టు కనిపిస్తున్నా.. అంతర్గతంగా మాత్రం కుమ్ములాటలు
- నామినేటడ్ పదవులు ఇస్తున్నారు. ప్రస్తుతానికి 20 పదవులను పంచారు.

అమరావతి: నామినేటడ్ పదవులు ఇస్తున్నారు. ప్రస్తుతానికి 20 పదవులను పంచారు. అయితే.. ఈ వ్యవహారం క్షేత్రస్థాయిలో కూటమిలో కీలక పార్టీలైన టీడీపీ-జనసేనల మధ్య వివాదాలను రగిలిస్తున్నట్టు తెలుస్తోంది. పైకి అంతా బాగున్నట్టు కనిపిస్తున్నా.. అంతర్గతంగా మాత్రం కుమ్ములాటలు ప్రారంభమవుతున్నాయి. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీగా జనసేన 21 అసెంబ్లీ స్థానాలకు మాత్రమే పరిమితమైంది. దీనికి అప్పట్లోనే పార్టీలో విమర్శలు వచ్చాయి. ఇన్ని తక్కువ సీట్లు తీసుకోవడం ఏంటన్న చర్చ కూడా జరిగింది. అయితే.. అప్పట్లో పవన్ కల్యాణ్ దీనికి వేర్వేరు భాష్యాలు చెప్పుకొచ్చారు. ఏమీ లేని స్థాయి నుంచి ఎదుగుతున్నట్టు తెలిపారు. దీనికి సహకరించా లన్నారు. దీంతో అందరూ సర్దుకు పోయారు. టీడీపీ నుంచి నాయకులను తీసుకుని టికెట్లు ఇచ్చినప్పు డు కూడా అందరూ మౌనంగా ఉన్నారు. అయితే.. ఎన్నికల సమయంలో మాత్రం పార్టీ విజయానికి పని చేశారు. ఇలాంటి వారు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. తమకు 100 శాతం స్ట్రయిక్ రేట్ వచ్చిన నేపథ్యంలో మిగతా..2లో

## గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచాక ఇంకో అవతారం.. ఏది నిజం?



'మీరు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో జరిగిన ఘటన ఇది

విచారించి నేరస్థులపై చర్యలు తీసుకోండి

సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు"
పవన్ కల్యాణ్

ఇండియాకు వచ్చాక పవన్ కల్యాణ్ ప్రశ్నలకు సమాధానమిస్తా

# ఆ దేశాలపై అణుదాడి చేస్తాం.. బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైళ్లు వాడితే..

మాస్కో: అణ్వాయుధాల వాడకం విషయంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కొత్త సిద్ధాంతాన్ని ప్రకటించారు. ఏ సమయంలో ఎప్పుడు, ఎందుకు అణ్వాయుధం వాడుతామో ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ అణ్వాయుధ రహిత దేశం నుంచి తమపై దాడి జరిగితే, ఆ దాడికి అణ్వాయుధ దేశం మద్దతు ఇస్తే, దాన్ని సంయుక్త దాడిగా పరిగణిస్తామని, ఆ సందర్భంలో తాము అణ్వాయుధాన్ని వాడనున్నట్లు పుతిన్ తెలిపారు. ఉక్రెయిన్ అణ్వాయుధ రహిత దేశమని, ఒకవేళ ఆ దేశం కనుక అణు దాడిలో పాల్గొంటే, దానిపై న్యూక్లియర్ వెపన్ ప్రయోగించే అవకాశాలు ఉన్నట్లు పుతిన్ వెల్లడించారు. పశ్చిమ దేశాలు అందిస్తున్న లాంగ్ రేంజ్ మిస్సైళ్లను ఒకవేళ ఉక్రెయిన్ వాడితే, అప్పుడు ఆ దేశంపై అణు బాంబుతో దాడి చేసే అవకాశాలు ఉన్నట్లు పుతిన్ వెల్లడించారు. నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ ఉన్నతాధికారులతో చర్చించిన ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఒకవేళ రష్యాపై భారీ స్థాయిలో మిస్సైల్ లేదా వైమానిక దాడి జరిగితే, దాని గురించి సమగ్రమైన సమాచారం అందితే, అప్పుడు అణ్వాయుధాన్ని వాడుతామని అన్నారు. రష్యాతో పాటు మిత్రదేశమైన బెలారస్‌పై కూడా దాడి జరిగితే తిప్పికొడుతామన్నారు. శత్రు దేశాలు ఒకవేళ బాలిస్టిక్ లేదా క్రూయిజ్ మిస్సైళ్ల, లేదా వ్యూహాత్మక వైమానిక దాడి, డ్రోన్లను వినియోగించినా.. ఆ దేశాలపై అణ్వాయుధాలతో అటాక్ చేయనున్నట్లు పుతిన్ తెలిపారు. అయితే తాము ప్రకటించిన కొత్త అణు సిద్ధాంతం ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందన్న విషయాన్ని మాత్రం పుతిన్ స్పష్టం చేయలేదు.

# దేశ ఆర్థిక రాజధాని ముంబై అతలాకుతలం

థానే: ఎడతెరిపి లేని భారీ వర్షాలతో దేశ ఆర్థిక రాజధాని ముంబై అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. రోడ్లు చెరువులను తలపించడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. పలుచోట్ల వాహనాలు కొట్టుకుపోయాయి. పోవాయ్, ఘట్కోపర్‌లో ఐదు గంటల్లోనే ఏకంగా 27 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మరోవైపు, థానేలోని ముంబ్రా బైపాస్‌లో కొండచరియలు విరిగిపడడంతో మూడు గంటలకుపైగా ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు క్రేన్ల సాయంతో బండరాళ్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ముంబై, థానేకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీచేశారు. నేడు కూడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. అంధేరీలో ఓపెన్ డ్రెయిన్‌లో 45 ఏళ్ల మహిళ మృతి చెందగా, వర్షాల కారణంగా మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వర్షాల నేపథ్యంలో 14 విమానాలను దారి మళ్లించారు. పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. రేపటి వరకు వర్షాలు ఇలాగే కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. ముంబై, దాని శివారు ప్రాంతాల ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని పోలీసులు సూచించారు. వర్షాల నేపథ్యంలో ముంబైలో నేడు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

# ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీకి జెడ్ కేటగిరీ భద్రత

ఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీకి దేశ రాజధాని పోలీసులు జెడ్ కేటగిరీ భద్రతను కల్పించారు. సీఎం కాన్వాయ్‌లో పైలట్‌తో సహా పోలీసు సిబ్బందితో భద్రతను కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. ప్రోటోకాల్ ప్రకారం, కేంద్ర హెూంశాఖ ఆదేశాల మేరకు ఢిల్లీ సీఎం జెడ్ కేటగిరీ భద్రతకు అర్హులు. జెడ్ కేటగిరీ భద్రత కోసం 22 మంది సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా ఉంటారు. జెడ్ కేటగిరీ భద్రతలో పీఎస్వోలు, ఎస్కార్ట్స్, సాయుధ గార్డులు ఉంటారు.

అతిశీ కేబినెట్ తొలి నిర్ణయం ఇదే

ఢిల్లీలో అసంఘటిత రంగ కార్మికుల వేతానాన్ని పెంచుతూ అతిశీ ప్రభుత్వం తొలి నిర్ణయం తీసుకున్నది. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈ కొత్త వేతనం ధరలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి అతిశీ వెల్లడించారు. ఈ నిర్ణయంతో నైపుణ్యం లేని కార్మికుల కనీస వేతనం రూ.18,066, మధ్యస్త నైపుణ్యం కలిగిన వారి వేతనం రూ.19,929, మెరుగైన నైపుణ్యం కలిగిన వారి వేతనం రూ.21,917కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

### గెలిచే ముందు ఒక అవతారం..
### గెలిచాక ఇంకో అవతారం..

# ఏది నిజం?

అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ మరో ట్వీట్ చేశారు. "గెలిచే ముందు ఒక అవతారం. గెలిచాక ఇంకో అవతారం. ఏంటీ అవాంతరం.. ఎందుకీ అయోమయం.. ఏది నిజం? జస్ట్ ఆస్కింగ్" అంటూ తనదైన శైలిలో పరోక్షంగా పవన్‌ను ఉద్దేశించే ఎక్స్ ఖాతాలో ఓ సందేశం ఉంచారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై ఆరోపణలపై దేశ వ్యాప్తంగా చర్చ సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం ప్రకాష్ రాజ్.. పవన్ కల్యాణ్‌ను కోట్ చేస్తూ ఓ పోస్ట్ పెట్టారు. 'మీరు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో జరిగిన ఘటన ఇది. విచారించి నేరస్థులపై చర్యలు తీసుకోండి. మీరెందుకు అనవసర భయాలు కల్పించి, దీన్ని జాతీయస్థాయిలో చర్చించుకునేలా చేస్తున్నారు. మన దేశంలో ఇప్పటికే ఉన్న మతపరమైన ఉద్రిక్తలు చాలు (కేంద్రంలో ఉన్న మీ స్నేహితులకు ధన్యవాదాలు)" అని పేర్కొన్నారు. దీనిపై పవన్ కల్యాణ్ మంగళవారం కనకదుర్గమ్మ ఆలయం వద్ద స్పందించారు. ప్రకాష్ రాజ్ అంటే గౌరవం ఉన్నప్పటికీ.. సున్నితాంశాలపై తెలుసుకుని మాట్లాడాలని పవన్ సూచించారు. " ప్రకాష్ రాజ్‌తో పాటు పాటు అందరికీ చెబుతున్నా.. విమర్శలకు ముందు ఏం జరిగిందో తెలుసుకోండి. సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు" అని పవన్ వ్యాఖ్యానించారు. పవన్ వ్యాఖ్యలకు ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ ప్రస్తుతం తాను విదేశాల్లో ఉన్నానని, ఇండియాకు వచ్చాక పవన్ కల్యాణ్ ప్రశ్నలకు సమాధానమిస్తానని, అప్పటిదాకా వీలుంటే తన ట్వీట్ మళ్లీ చదవి అర్థం చేసుకోవాలని" అని పేర్కొన్నారు. ఈ లోపు.. ఈలోపే.. 'సత్యం సుందరం' ఈవెంట్‌లో 'లడ్డూ అంశం ప్రస్తుతం సున్నితమైంది' అని నటుడు కార్తీ నవ్వుతూ చెప్పడంపైనా పవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పవిత్రమైన విషయాలను అపహాస్యం చేసేలా మాట్లాడొద్దని సూచించడంతో కార్తీ క్షమాపణ చెప్పారు. అందుకు పవన్ బదులిస్తూ, కార్తి కావాలని అనలేదని అర్థమైందని అనడంతో అక్కడికి ఆ వివాదం ముగిసింది. అయితే.. 'చేయని తప్పునకు సారీ చెప్పించుకోవడంలో ఆనందమేంటో! జస్ట్ ఆస్కింగ్...' అని ప్రకాశ్‌రాజ్ పోస్ట్ చేయడంతో ఈ వ్యవహారం ఇక్కడితోనే ముగిసిపోదని అర్థమైంది.

# మూసీ రివర్ బెడ్ లో సర్వే

హైదరాబాద్: మూసీ నది ఒడ్డున ఆక్రమణలను తొలగించి ప్రక్షాళన చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మూసీ సుందరీకరణ పనులలో భాగంగా ఆక్రమణ తొలగింపు బాధ్యతను ప్రభుత్వం హైడ్రాకు అప్పగించింది. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు మూసీ రివర్ బెడ్ లో గురువారం తెల్లవారుజాము నుంచే సర్వే చేపట్టారు. అక్రమ నిర్మాణాలకు మార్కింగ్ చేస్తూ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ విషయంపై హైడ్రా చీఫ్ రంగనాథ్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో భేటీ అయ్యారు. ఆక్రమణల తొలగింపు, నిర్మాణాల కూల్చివేతతో నిర్వాసితులుగా మారబోయే కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లతో పాటు పరిహారం ఇస్తామని ప్రకటించారు. ప్రస్తుతం మూసీ రివర్ బెడ్ లో సర్వే జరుపుతున్న అధికారులు నిర్వాసితులకు సాయం అందించేందుకు అవసరమైన వివరాలను కూడా సేకరిస్తున్నారు. నిర్వాసితులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పునరావాసం కల్పించడంతో పాటు అందించనున్న పరిహారం విషయంలో కలెక్టర్ల సమక్షంలోనే ప్రతీ కుటుంబానికి వివరాలను అందించేలా షెడ్యూలు రూపొందించారు. గోల్కొండ మండల పరిధిలోని ఇబ్రహీంబాగ్, ఆశ్రమ్‌నగర్, పాతబస్తీలోని ఛాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్‌లో హైడ్రా అధికారులు సర్వే నిర్వహించారు. కూల్చబోయే నిర్మాణాలపై మార్క్ చేస్తున్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో మొత్తం 12 వేల ఆక్రమణలను గుర్తించినట్లు సమాచారం. వాటన్నింటినీ తొలగించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. నిర్వాసితులకు చట్టప్రకారం పునరావాసం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇవ్వగా... ఇటీవల మత్రి పొన్నం ప్రభాకర్ కూడా పలుచోట్ల పర్యటించి అక్కడి నివాసితులతో మాట్లాడి భరోసా కల్పించారు.

### ప్రధాని మోదీ ముందు

# చెస్ చాంపియన్స్ గేమ్

మొదటి పేజి తరువాయి



గోల్డ్ మెడల్స్ సాధించిన భారత బృందం టోర్నమెంట్ తర్వాత స్వదేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ని కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీతో వైశాలి, హారిక, తానియా, విదిత్, సచ్‌దేవ్, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేశి సహా స్వర్ణం గెలిచిన క్రీడాకారులు భేటీ అయ్యారు. క్రీడాకారులతో మాట్లాడిన ప్రధాని మోదీ గేమ్‌లో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారందరినీ పేరుపేరునా ప్రత్యేకంగా అభినందించారు మోదీ. ప్రధాని సమక్షంలో ప్రజ్ఞానంద్, అర్జున్ ఓ గేమ్ కూడా ఆడారు. వారు గేమ్ ఆడుతుంటే ప్రధాని ఇంట్రెస్ట్‌గా చూశరు. ఆ తర్వాత క్రీడాకారులు ప్రధాని నరేంద్ర మోదీకి చెస్ బోర్డును గిఫ్ట్‌గా ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ప్రస్తుతం ఆ వీడియో వైరల్‌గా అవుతోంది. మరోవైపు స్వర్ణాలు గెలిచిన భారత బృందానికి ఆలిండియా చెస్ సమాఖ్య రూ.3.2 కోట్ల భారీ నజరానా ప్రకటించింది. ఆటగాళ్లకు రూ. 25 లక్షలు, పురుషుల, మహిళల జట్టు కోచ్‌లు అయిన అభిజిత్ కుంటె, శ్రీనాథ్ నారాయణన్‌కు తలా రూ.15 లక్షలు పంచనున్నారు. అలాగే భారత బృందానికి చీఫ్‌గా వ్యవహరించిన దివ్యేందు బరువకు రూ.10 లక్షలు, అసిస్టెంట్ కోచ్‌లలో ఒక్కొక్కరికి రూ. 7.5 లక్షలు అందనున్నాయి.

# ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా?



హైదరాబాద్: హైడ్రా బాధితులకు తాము అండగా ఉంటామని, ఎవరికైనా ఏమైనా సమస్య వస్తే హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ఆఫీస్... తెలంగాణ భవన్‌కు రావాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... హైడ్రా బాధితులందరికీ తప్పకుండా తమ పార్టీ, తమ పార్టీ న్యాయవిభాగం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తమ పార్టీ కార్యాలయం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 10, రోడ్డు నెంబర్ 12 మధ్యలో ఉంటుందని, బాధితులు అక్కడికి రావొచ్చని సూచించారు. అక్కడ తమ న్యాయవిభాగం సహకారం అందిస్తుందన్నారు. తమకు ఓటు వేసి గెలిపించినందుకు హైదరాబాద్ ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అక్కడకు రాలేని పరిస్థితుల్లో హైదరాబాద్‌లో దాదాపు అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ కార్పోరేటర్లే ఉన్నారని, వారి వద్దకు వెళ్లవచ్చన్నారు. న్యాయపరంగా అండగా ఉంటామన్నారు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించాలని న్యాయస్థానం ద్వారానే ప్రభుత్వానికి చెప్పిస్తామని తెలిపారు. పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తున్నారని ఆరోపించారు. సామాన్యుల పట్ల అమానవీయంగా ప్రవర్తించడం దారుణం అన్నారు. ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న దుకాణాలు నడుపుకునే వారు చాలా చిన్న చిన్న వాళ్లేనని అన్నారు. ఆక్రమణల తొలగింపు మంచిదే కానీ... ప్రత్యేకంగా వెండింగ్ జోన్‌ను ఏర్పాటు చేసి వారిని అక్కడి నుంచి పంపించాలని సూచించారు. కోటీశ్వరుల ఆక్రమణలు కూల్చివేస్తే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చని... కానీ సామాన్యులు ఇబ్బంది పడతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ శాఖ ఏం చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. కొంతమంది నివాసాలు రిజిస్ట్రేషన్ అయిన మూడు రోజులకే కూల్చివేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా? అని నిలదీశారు. ఈ ప్రభుత్వానికి దమ్ముంటే పర్మిషన్ ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. అందుకే అన్యాయం జరుగుతున్న వారికి అండగా ఉండాలని తాము నిర్ణయించుకున్నామన్నారు. తాము పేదల వద్దకు వెళ్లి... బుల్డోజర్లను అడ్డుకుంటామన్నారు. తాము ఆక్రమణలను ప్రోత్సహించడం లేదని, కానీ మానవీయ కోణంలో ఆలోచించాలని సూచిస్తున్నామన్నారు. అయినా, ఆక్రమణలు అన్నీ కాంగ్రెస్ వారివే ఉంటాయని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు న్యాయం చేద్దామని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. ఆక్రమణలన్నింటినీ కూలగొట్టాలని ప్రభుత్వం భావిస్తే జీహెచ్ఎంసీ కార్యాలయం నాలా మీదనే ఉందని గుర్తించాలన్నారు. మంత్రులు ఇళ్లు, ఫామ్ హౌస్‌లు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయని ఆరోపించారు.

### కుదురుపాకలో స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్నానని కేటీఆర్ ట్వీట్

పెద్దపల్లి జిల్లాలోని కుదురుపాకలో కేటీఆర్ ఈ రోజు స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. తన గ్రాండ్ పేరెంట్స్ జె.కేశవరావు, లక్ష్మీల జ్ఞాపకార్థం ఈ స్కూల్ భవంతిని నిర్మించినట్లు తెలిపారు.

# నామినేటెడ్ పదవులపై ఆశలు

మొదటి పేజి తరువాయి

తమకు 100 శాతం స్ట్రయిక్ రేట్ వచ్చిన నేపథ్యంలో నామినెటడ్ పదవుల్లో ఆ మేరకు కేటాయింపు ఉంటుందని ఆశించారు. దీనికి సంబంధించి కొన్నాళ్లుగా పార్టీలోనూ చర్చ సాగుతోంది. చంద్రబాబు కూడా ఒక సందర్భంలో 18 నుంచి 20 శాతం వరకు పదవులను జనసేనకు ఇస్తామని ప్రకటించినట్టుగా ప్రచారం జరిగింది. మరో కూటమి పార్టీ బీజేపీకి 8 శాతం వరకు పదవులు ఇస్తామన్నారని చెప్పుకొచ్చారు. తీరా ఇప్పుడు పదవులు పంచిన తర్వాత.. ఈ శాతాలు ఎటు పోయాయన్నది ప్రశ్నగా మారి.. జనసేన నేతలకు–టీడీపీకి మధ్య దూరం పెరుగుతోంది. ప్రస్తుతం 20 పదవులను మాత్రమే పంచారు. కానీ, వీటిలో జనసేనకు చాలా చాలా తక్కువ స్థానాలే దక్కా యి. దీనిని గమనిస్తే.. తమకు మరింత అన్యాయం చేస్తున్నారన్న వాదన జనసేనలో వినిపిస్తోంది. అధినేత పవన్ మాత్రం ఇచ్చింది చాలన్నట్టుగా ఉంటున్నారన్నది నాయకుల మాట. ఈ పరిణామాలతో క్షేత్ర స్థాయిలో పార్టీల మధ్య వివాదాలు.. విభేదాలు.. ఆధిపత్య రాజకీయాలకు బీజం పడుతోంది. ఇన్నాళ్లు జనసేనలో ఉన్నా.. తమకు ఎలాంటి గుర్తింపు లేదని భావిస్తున్న వారితో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. మరి దీనిని ఎలా సరిచేస్తారో చూడాలి.

### ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారు?..

# ఈడీకి సుప్రీం కోర్టు మందలింపు

మొదటి పేజి తరువాయి

హాజరుకాక పోవడం, నిందితులలో కొందరిపై నాన్–బెయిలబుల్ వారెంట్లను అమలు చేయకపోవడం వల్ల అభియోగాలు నమోదు చేయడం సాధ్యం కాదని ఛత్తీస్ హైకోర్టు గతంలో పేర్కొంది. ఈ దరిమిలా, తదుపరి తేదీలో విచారణకు అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో, తాము పిటిషనర్‌ను మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని నిర్దేశిస్తున్నామని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే ఆమె మధ్యంతర బెయిల్‌పై ఉన్నందున తిరిగి సర్వీస్‌లో చేర్చుకోవద్దని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెన్షన్‌లో ఉంచాలని కూడా అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. చౌరాసియా తదుపరి కోర్టు విచారణకు హాజరుకావాలని, అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సాక్షులను ప్రభావితం చేయడానికి లేదా సాక్ష్యాలను తారుమారు చేయడానికి ప్రయత్నించవద్దని, ఆమె తన పాస్‌పోర్ట్‌ను ప్రభుత్వానికి అప్పగించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారిస్తున్న కేసుల్లో నేరారోపణ రేటు ఎంతని? నిందితులను ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారంటూ సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కాగా ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదించగా, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, న్యాయవాది పల్లవి శర్మ ఈ కేసులో చౌరాసియా తరపున వాదించారు. సౌమ్య చౌరాసియా 2022 డిసెంబర్‌లో బొగ్గు కుంభకోణంతో సంబంధమున్న మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యారు. తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఆదేశాలను చౌరాసియా సుప్రీం కోర్టులో సవాలు చేశారు.

### బాబోయ్ ఎన్ని పతకాలో!

# మను బాకర్ సాధించిన మెడల్స్ చూశారా?



ఇంటర్నెట్ డెస్క్: పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన మను బాకర్ భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పి అదరగొట్టింది. ఒకే ఎడిషన్‌లో డబుల్ మెడల్స్ విజేతగా నిలిచిన భారతీయ తొలి అథ్లెట్‌గా అరుదైన రికార్డు నెలకొల్పింది. చిన్న వయసులోనే షూటింగ్ విభాగంలోకి ప్రవేశించిన మను.. తన కెరీర్‌లో సాధించిన పతకాలతో దిగిన ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేశారు. "14 ఏళ్ల వయసులో షూటింగ్‌లో నా ప్రయాణాన్ని మొదలు పెట్టా. ఇంతదూరం వస్తానని ఏనాడూ ఊహించలేదు. మీరు ఏదైనా ప్రారంభిస్తే.. మీ కలలు ఎంత కఠినమైనవైనా వెనకడుగు వేయకుండా వాటిని సాధించేందుకు అవిశ్రాంతంగా కృషిచేయండి. ఏకాగ్రతతో ముందుకు సాగండి. మీ అభిరుచే మీ ప్రయాణానికి ఇంధనంలా ఉపయోగపడుతుంది. ఆ దిశగా వేసే ప్రతి చిన్న అడుగు మిమ్మల్ని ఉన్నత స్థానాలకు చేరువ చేస్తుంది. అలా చేస్తే.. మీరు అనుకున్నదానికంటే ఎక్కువ చేయగలరు. ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించాలన్న నా కల కొనసాగుతోంది" అని మను రాసుకొచ్చారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు మెడల్స్ సాధించిన మను బాకర్‌ను పలు సంస్థలు సన్మానిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె ఆయా కార్యక్రమాలకు హాజరై తాను సాధించిన పతకాలను ప్రదర్శిస్తుండటంపై కొందరు మీమ్స్‌తో ట్రోల్స్ చేస్తున్నారు. ఆమె ఈ పతకాలతో షో ఆఫ్ చేస్తోందంటూ కామెంట్లు పెట్టడంపై ఇటీవల ఘాటుగా స్పందించింది. "నేను సాధించిన పతకాలను ఎందుకు చూపించొద్దు? ఎవరైనా తాము సాధించిన పతకాలను చూపించాలనే అనుకుంటారు కదా.. నేనూ కచ్చితంగా నా మెడల్స్‌ను చూపిస్తా" అంటూ ట్రోల్స్‌ను ఇటీవల తిప్పికొట్టింది. ఈ నేపథ్యంలో తాజాగా తాను పతకాలతో ఉన్న ఫొటోను షేర్ చేయడం గమనార్హం.

# రెండు చీరలు ఇస్తానన్న ముఖ్యమంత్రి ఏమై పోయావ్..

### బతుకమ్మ చీరల బంద్‌పై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్: బతుకమ్మ చీరల పంపిణీ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలిపివేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అత్తమీద కోపం దుత్త మీద తీర్చినట్లుగా ముఖ్యమంత్రి వ్యవహారం ఉందని విమర్శించారు. మా మీద కోపం ఆడబిడ్డల మీద చూపిస్తున్నారని ఫైరయ్యారు. తెలంగాణ ఆడబిడ్డల అపురూప వేడుక బతుకమ్మ పండుగ అని చెప్పారు. ఈ సందర్భంగా ఆడబిడ్డలకు కేసీఆర్ సర్కార్ పుట్టింటి నుంచి చీర పంపినట్లు పంపేదని చెప్పారు. వారి సంతోషంలో భాగం అయ్యేదని వెల్లడించారు. ఆడబిడ్డలకు ఇంకా గొప్పగా ఇవ్వాలి అనుకుంటే ఇవ్వండి స్వాగతిస్తాం.. అంతే కానీ ఇచ్చేది కూడా ఆపేస్తే ఎలా అని ప్రశ్నించారు. లక్షల కోట్ల బడ్జెట్ పెట్టుకునే తెలంగాణ ప్రభుత్వం.. ఆడబిడ్డలకు ఇచ్చే చీరలు కూడా ఇవ్వలేదా అని నిలదీశారు. రెండు చీరలు ఇస్తానన్న ముఖ్యమంత్రి ఏమై పోయావ్ అంటూ ఎక్స్ వేదిగా దుయ్యబట్టారు.




### బతుకమ్మ చీరల పంపణీని నిలిపివేసిన కాంగ్రెస్ సర్కారు

రాష్ట్రంలోని ఆడబిడ్డల కోసం ప్రతి ఏడాది కోటి బతుకమ్మ చీరల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచింది. పండుగ సమీపిస్తున్నా ఇప్పటి వరకు చీరల పంపిణీ ఊసే లేదు. కనీసం కానుకలు ఇచ్చే అంశం కూడా తెరపైకి రాలేదు. దీంతో ఆడబిడ్డలు మనోవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే బతుకమ్మ చీరల పంపిణీకి మంగళం పాడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బతుకమ్మ చీరల పంపిణీ రాష్ట్రంలో పండుగలా సాగేది. ఉచిత చీరలతో బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకునేవారు.


బతుకమ్మ చీరల పంపిణీని నిలిపివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నేత కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఏడాది చీరల తయారీ కోసం ఆర్డర్లు లేకపోవడంతో రాష్ట్రంలోని నేతన్నల జీవితాలు ఛిద్రమవుతున్నాయి. నేత కార్మికులు మళ్లీ ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్నారు. గత సీఎం కేసీఆర్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతో చేనేత కార్మికులు అన్ని విధాలా అభివృద్ధి చెందారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. 2017 నుంచి 2023 వరకు ప్రతి ఏడాది దాదాపు కోటి మంది మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ చేశారు. చీరల తయారీకి ఏడాదికి దాదాపు రూ.300 కోట్లకు పైగానే మొత్తం రూ.2,157 కోట్లు కేటాయించింది.

# బీజేపీ నేత చెప్పిన సమాధానం విని ఆశ్చర్యపోయాను: అరవింద్ కేజ్రీవాల్




ఢిల్లీ: తన అరెస్ట్ వల్ల మీకు వచ్చిన లాభం ఏమిటని తాను ఓ బీజేపీ సీనియర్ నేతను అడిగానని... తన ప్రశ్నకు అతను చెప్పిన సమాధానం విని తాను ఆశ్చర్యపోయానని ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. సీఎం అతిశీతో కలిసి ఆయన ఢిల్లీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తన అరెస్ట్ వల్ల ఏం లాభం కలిగిందని అడిగితే... ఢిల్లీలో పాలన పట్టాలు తప్పిందని, పనులు ఆగిపోయానని ఓ బీజేపీ నేత సమాధానం చెప్పారని, ఇది విని తాను ఆశ్చర్యపోయానన్నారు. ఢిల్లీలో పనులు ఆగిపోయేలా చేసి, పాలన పట్టాలు తప్పేలా చేసి, ప్రజలకు అసౌకర్యం కలిగించడమే వారి ఉద్దేశమా? అని ప్రశ్నించారు. ఢిల్లీ ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, నిలిచిపోయిన పనులన్నింటినీ మొదలు పెడతానని హామీ ఇచ్చారు. అన్ని సమస్యలు క్రమంగా తొలగిపోతాయన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు కూడా యాక్షన్ మోడ్‌లోనే ఉన్నానని పేర్కొన్నారు.

# నేను కులపార్టీలో చేరేందుకు ప్రయత్నించానా? అచ్చెన్నాయుడుపై విజయసాయిరెడ్డి ఫైర్



అమరావతి: టీడీపీ నేత, మంత్రి అచ్చెన్నాయుడిపై వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విజయసాయిరెడ్డి టీడీపీలోకి వచ్చేందుకు ప్రయత్నించారంటూ అచ్చెన్న చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... "అచ్చెన్నాయుడూ! దేముడు నిన్ను పుట్టించేటప్పుడు మెదడు, బుద్ధి, జ్ఞానం 0.1% మాత్రమే ఇచ్చాడాయె! చిన్నప్పుడు మీ ఫ్రెండ్స్. అచ్చి.. బుచ్చి... కచ్చి... అని ఆట పట్టించేవారట కదా! దేహం పెరిగినట్టుగా మెదడు వృద్ధి చెందక పోవడం వల్ల మీ చేష్టలు, మాటలు అన్నీ వింతగా ఉంటాయి. మోకాలికి, బోడి గుండుకు లంకె పెడుతుంటావు. నా విధేయత, కమిట్మెంట్, నిబద్ధతలపై జోకులు పేలుస్తున్నావు. విజయసాయిరెడ్డి అనే నేను టీడీపీ అనే కులపార్టీలో చేరేందుకు ప్రయత్నించానా? అచ్చెన్నా... నువ్వు ఎంత గట్టిగా అనుకున్నా ఈ జన్మకి నీ కోరిక తీరదయ్యా! భ్రమల లోకంలో గెంతులేయాలనుకుంటే, గో...ఆన్... నిన్ను ఆపేదెవరు. జత ఎద్దులకుండే బలం ఉంది నీ ఒక్కడికి. మేథో శక్తికి, అడ్డం–నిలువుకు మధ్య ఉండే తేడా తెలియక పోవడం వల్లే మీతో ఈ సమస్యంతా" అని ట్వీట్ చేశారు.

# మూగ జీవాల సేవకులకు ముప్పుతిప్పలు..

### జీతాలు ఇప్పించండి బాబోయ్ అని వేడుకలు.



ఏటూరునాగారం(ములుగు) (గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: మాకు జీతాలు ఇవ్వండి మహాప్రభో అని జీతాలు రాని సంచార వైద్యులు, వాహన సిబ్బంది వేడుకుంటున్నారు. గురువారం సంచార పశు వైద్యురాలు డాక్టర్ అనూష మాట్లాడుతూ పాడి సంపద పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1962 సంచార పశు వైద్య వాహనాల్లో విధులు నిర్వహిస్తున్నవైద్యులు ,సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాలు



అందకఇబ్బందులుపడుతున్నామన్నారు. గత ప్రభుత్వం 2017 లో పశువులకు వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 100 వాహనాలు ఏర్పాటు చేసింది. 1962 సంచార పశు వైద్య వాహనం ద్వారా పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించడంతో గ్రామాల్లో పశు మరణాలు తగ్గుముఖం పట్టాయి. ప్రభుత్వం గత ఏడాది 1962 వాహనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడంతో మందుల కొరత ఏర్పడింది ఉన్న మందులతో సిబ్బంది పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాము. సిబ్బందికి సకాలంలో వేతనాలు అందడం లేదు. 1962 వాహనాల బలోపేతానికి నిధులు మంజూరు చేసి మందుల కొరత నివారించి సిబ్బందికి సక్రమంగా వేతనాలు చెల్లించాలని మేము కోరుచున్నాము. 2017 వ సంవత్సరం నుండి ఇంతవరకు ఎలాంటి ఇంక్రిమెంట్లు కూడా ఇవ్వలేదని, సమాన పనికి సమాన జీతం ఇవ్వాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కూడా మాకు ఎలాంటి నిధులు కేటాయించలేదని వారు కోరారు.తక్షణమే కొన్ని నెలలుగా పెండింగ్ లో ఉన్న మా వేతనాలను విడుదల చేసి మమ్మల్నిఆదుకోవాలని ,లేదంటే విధులను బహిష్కరించి స్ట్రైక్ చేస్తామని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.వీరితో పాటు పారవేట్ ధనుంజయ్ కెప్టెన్ రవితేజ, హెల్పర్ శ్యామ్ లు పాల్గొన్నారు.

# నేడు బాబా జయంతి సందర్భంగా,కేక్ కటింగ్

### ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ.



ఏటూరునాగారం,(గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: ఏటూరునాగారం మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం లో బాబా జయంతి సందర్భంగా ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు ఎల్లాప్రగడ బాను ప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం,పంచామృత అభిషేకాలు, అర్చనలు పలు రకాల పూజా కార్యక్రమాలు,తీర్ధ ప్రసాదాల అనంతరం కలాకండ్ తో బాబా గూర్చి ప్రత్యేకంగా తయారు చేసిన కేక్ కటింగ్ ఉంటుంది అని, ఇదే కాకుండా మధ్యాహ్నం హారతి తర్వాత అన్నప్రసాద వితరణ వుంటాయని ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ కమిటీ సభ్యులు విలేకరులకు ఒక ప్రకటన లో తెలిపారు ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ .గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి బాబా దివ్య ఆశీస్సులు పొంది,అన్న ప్రసాద కార్యక్రమం విజయ వంతం చేయాలని కోరారు.

# ఆర్థిక సహాయం అందించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



ఏటూరునాగారం (గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: కాకులమర్రి.లక్ష్మీనరసింహారావు ఆదేశం మేరకు వారు అందించిన ఆర్థిక సహాయాన్ని గోగుపల్లిగ్రామంలోయాలంరాంబాబు కుటుంబ సభ్యులైన తల్లి మరియు భార్యా పిల్లలకు 21,000 రూపాయల నగదు 1,ఒక క్వింటా బియ్యాన్ని ఏటూరునాగారం మండల కమిటీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ మండల కమిటీ ఆధ్వర్యంలో కాకుల.మర్రి ప్రదీప్ రావుతో కలిసి



అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు. గడదాసు సునీల్ కుమార్,. తాడూరి రఘు, దన్నపునేని. కిరణ్,కాకులమర్రి భాస్కర్ బాబు, కుమ్మరి. చంద్రబాబు, శివాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల మహేష్,వావిలాల. ముత్తయ్య, జాడిబోజారావు,కాళ్ళ.రామకృష్ణ,షాపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు,మాదరి. రాంబాబు, ఖలీల్,ముస్తఫా, రాజు యాదవ్,బాసాని శేఖర్,నాగ సాగర్,దడిగల.లక్ష్మణ్, వావిలాల, కిషోర్, పెంచికల. లక్ష్మినారాయణ,మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కనుకుల సదన్న, రావుల.జగన్,రావుల.సుమన్, ఈసం. సారయ్య, దొడ్డి.హరీష్, మిట్టకంటి. సమిరెడ్డి, తమ్మల.రాంరెడ్డి,కనుకుల. వెంకన్న,గుడుకుంట్ల. భీమయ్య, ఏనుగుల. ఐలయ్య,మాదరి. అశోక్, బత్తుల.సుమన్, ఏనుగుల. రమేష్ దొడ్డి నరేష్ బీరెడ్డి నర్సింహా రెడ్డి దాసరిరాజు,ఆడెపు.వెంకటేష్, దాసరి. రాజు,అడెపు. వెంకటేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ కు నేషన్ బిల్డర్ అవార్డు





ఏటూరునాగారం (గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: ఏటూరునాగారంకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక సేవకుడు గజ్జెల సుమన్ రోటరి క్లబ్, హనుమకొండ వారిచే నేషన్ బిల్డర్ అవార్డు అందుకున్నారు. హనుమకొండ భీమారంలోని ఎస్వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ వారి స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా హనుమకొండ కు చెందిన వివిధ జిల్లాలలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను పలువురిని గుర్తించి నేషన్ బిల్డర్ అవార్డుతో సత్కరించడం జరిగింది. గజ్జెల సుమన్ హనుమకొండలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, రంగంపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. ఈ అవార్డును వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , ఎస్వీస్ విద్యా సంస్థల చైర్మన్ తిరుమల రావు , రోటరీ క్లబ్-హనుమకొండ అధ్యక్షులు శారు ప్రభాకర్ రెడ్డి చే అందుకోవడం జరిగింది. గజ్జెల సుమన్ పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తూనే, విద్యార్థులకు అనేక మెలకువలను నేర్పిస్తూ పాఠశాలకు దాతల సహకారంతో అనేక వస్తువులను సమకూర్చడం జరిగింది. అంతేకాక 18 సార్లు రక్తదానం చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా గజ్జెల సుమన్ ను పలువురు మిత్రులు మరియు శ్రేయోభిలాషులుఅభినందించారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్ , కోశాధికారి ఏ.విజయ్ కుమార్ ,రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నవాబ్ పేట్ - పోతులబోగూడ రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తిచేయాలని

### మెదక్ ఎంపీ రఘునందన్ రావును కోరిన -అశోక్ సాదుల...

శివ్వంపేట(గౌతమ్ న్యూస్): మండలంలోని నవాబ్ పేట్, లచ్చిరెడ్డిగూడెం, గోమారం, చంది, ఉసిరికపల్లి, భీమ్లాతాండ, పాంబండ, పోతులబోగూడ గ్రామాల మీదుగా వెళ్తున్న రెండు


Nation First Party Next Self Last
భారతీయ జనతా పార్టీ - తెలంగాణ
BHARATIYA JANATA PARTY, TELANGANA



వరుసల రహదారి విస్తరణ పనులు నత్త నడకన సాగుతున్నందున ఆయా గ్రామాల ప్రజలు తరచు రోడ్డు ప్రమాదాలతో ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ఇటీవలే కురుస్తున్న వర్షాలకు ఆ మట్టి రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిపోయి చాలా ఇబ్బంది అవుతుందని, ఈ రెండు వరుసల రహదారి విస్తరణకు సెంట్రల్ రోడ్ ఫండ్స్ నుండి నిధులు గత రెండు సంవత్సరాల క్రితమే విడుదలయ్యాయని, ఈ రోడ్డు పనులు ప్రారంభించి దాదాపుగా పదకొండు నెలలు కావస్తున్న రోడ్డు పనులు మాత్రం నత్త నడకన సాగుతున్నాయని వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తిచేయాలని భారతీయ జనతాపార్టీ శివ్వంపేట మండల ప్రధాన కార్యదర్శి అశోక్ సాదుల మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు గారి నివాసానికి వెళ్లి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అశోక్ సాదుల వినతి మేరకు రఘునందన్ రావు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని మాట్లాడడం జరిగింది. అలాగే వెల్దుర్తి నుండి సికింద్రాబాద్ వరకు వెళ్ళే బస్సును యధావిధిగా నడపాలని అశోక్ సాదుల వినతి పత్రంలో కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరా రెడ్డి , శివ్వంపేట మండల అధ్యక్షులు పెద్దపులి రవి , మాజీ సర్పంచులు పనసా రెడ్డి , ఆంజనేయ చారి , మండల ప్రధాన కార్యదర్శులు సుదర్శన్ , నాగేందర్ రెడ్డి , ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , బూత్ అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# అసంబద్ధమైన జి. ఓ.25 ను రద్దు చేయాలి

### సజ్జనము విద్యాసాగర్

(గౌతమ్ న్యూస్): టీచర్ల సర్దుబాటు పేరుతో తెచ్చిన అసంబద్ధ జీవో నెంబర్ 25 ఉపసంహరించుకోవాలని టి.పి.టి.ఎఫ్ సీరోల్ మండల ప్రధాన కార్యదర్శి సజ్జనని విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవో నెంబర్ 25 రద్దు చేయాలని కోరుతూ బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మహబూబాద్ నందు నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశంలో టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జనము విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ అజెండాలో జీరో ఎన్రోల్ మెంట్ ఆన్న పాఠశాలలను కూడా మూసివేయని చెప్పుతూనే మరో పక్కనుండి ఇలాంటి అసంబద్ధ నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ప్రాథమిక పాఠశాలల్లో 11 మంది పిల్లలున్న చోట ఇద్దరు ఉపాధ్యాయులు, అదేవిధంగా 60 మంది ఉన్న చోట కూడా ఇద్దరే ఉపాధ్యాయులను ఉంచాలని ఆదేశించడం అసంబద్ధమని విద్యాశాఖ అధికారులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఐదు తరగతి లకు 18 సబ్జెక్టులను ఇద్దరు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులను పూర్తిగా దూరం చేసేలా ఈ నిబంధనలో ఉన్నాయని అన్నారు. ఇటీవల జరిగిన బదిలీలలో 40 మంది పిల్లలు దాటితే ముగ్గురు టీచర్లను ఇచ్చి, ఇప్పుడు సర్దుబాటు పేరుతో జీవో నెంబర్ 25 ఆధారంగా తీయడం ఎంతవరకు సమంజసం అని ఇది ఏమిటో అర్థం కాలేదని ఆవేదనను వ్యక్తం చేశారు. ఎన్నో ఎండ్లకింద రూపొందించిన,కాలం చెల్లిన నిబంధనలను ఇప్పటికీ అమలు చేయ చూడడం సరి కాదని అన్నారు.



ఈ నిబంధనలు యధావిధిగా అమలు చేస్తే ఉన్నత పాఠశాలలోనూ ఉపాధ్యాయులపై మోయలేని భారం పడుతుందని ఇది విద్యా ప్రమాణాలపై ఫలితాలపై ప్రభావం చూపుతోందని అన్నారు. అసంబద్ధంగా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు మూసివేసిన బడులను తెరిపిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఉన్నబడులను మూసివేసే విధానాలను అమలు చేస్తున్నారని,ప్రభుత్వం తమ ఎజెండా లో పేర్కొన్నట్లుగా పాఠశాలలను మూసివేయకుండా కొనసాగించాలి,పెండింగ్ లో ఉన్నా బిల్లులు అన్నిటినీ చెల్లించాలి,పెండింగ్ లో ఉన్న డిఏ లను విడుదల చేయాలి,చనిపోయిన ఉపాధ్యాయులకు రావల్సిన అన్ని ఆర్థికపరమైన ప్రయోజనాలను వెంటనే చెల్లించాలి,కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో సింగం రవీందర్, సాయిలు,వంగేటి సురేష్, వేంపటి విజయ్ రాజ్,శేరు సోమయ్య, ఓ.ఝాన్సి , కె .మాధవి తదితరులు పాల్గొన్నారు

# వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి

### ఘనంగా చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు.

### పూల మాలలు వేసి నివాళులు అర్పించిన...

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

ఏటూరునాగారం(ములుగు) (గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: భూమి కోసం.. భుక్తి కోసం.. బానిస సంకెళ్ల విముక్తి కోసం జరిగిన పోరాటంలో నిప్పుకణికగా నిలిచి ఆడది అబల కాదు సబల అని నిరూపించిన వీరనారి చాకలి ఐలమ్మ గొప్ప పోరాట యోధురాలు ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ లో వెనుకబడిన తరగతుల సంక్షేమ





శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 129 వ జయంతి ఉత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బహుజన చైతన్యానికి, మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ 129వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అధికారికంగా జరపడం సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనలో మగ్గుతున్న తెలంగాణలో తొలి భూ పోరాటానికి, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన ధైర్యశాలి చాకలి ఐలమ్మ గారని అన్నారు. దొరల దాష్టీకానికి ఎదురుతిరిగి తన పంట గింజలు రక్షించడమే కాకుండా, నాటి నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ఎందరికో స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ సాయుధ పోరాటంలో తనకంటూ ఓ ప్రత్యేకస్థానాన్నిసంపాదించుకున్న పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ గారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆమె తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయని పేర్కొన్నారు. తెలంగాణ పౌరుషాన్ని, పోరాటాన్ని, త్యాగాన్ని భావి తరాలకు అందించి ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని పునికి పుచ్చుకుని ప్రతీ ఒక్కరూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, బిసి సంఘ నాయకులు, సభ్యులు,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐలమ్మ 129 వ జయంతి వేడుకలు

ఏటూరునాగారం(గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: భూమి కోసం భుక్తి కోసం పోరాడిన వీర వనిత చిట్యాల ఐలమ్మ 129 వ జయంతి వేడుకలు ఏటూరునాగారం మండల కేంద్రంలోని రజక వాడలో రజకులంతా ఏకమై ఘనంగా నిర్వహించారు. మొదటగా ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కొబ్బరికాయలు కొట్టి తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం భుక్తి కోసం చేత కొడవలి పట్టి కొంగు నడుము చుట్టి దొరల గుండెల్లో గుబులు పుట్టించి వీర వనిత చిట్యాల ఐలమ్మ చేసిన సాయుధ పోరాటాన్ని స్మరించుకున్నారు.అనంతరం మిఠాయిలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో పర్వతాల ఎల్లయ్య,



పర్వతాల కుమారస్వామి, పర్వతాల అశోక్, పర్వతాల రమేష్, కుదురుపాక రాజేశ్, కుదురుపాక ప్రవీణ్,పర్వతాల రాజ్ కుమార్,వద్దేపల్లి హరీష్, కుమ్మరికుంట్ల సతీష్, పర్వతాల బిక్షపతి, పర్వతాల నర్సింహులు, పర్వతాల ఎల్లయ్య, మడిగిల నరేష్,పర్వతాల విష్ణు, పర్వతాల మిధ్వన్ సాయి, పర్వతాల సంతోష్, వద్దేపల్లి వెంకటేశ్వర్లు,పర్వతాల చిన్న రాంబాబు, పర్వతాల పెద్దోడు,కుదురుపాక గిరిబాబు,పర్వతాల తేజ, పర్వతాల రవి, గాదె వెంకటేశ్వర్లు లక్ష్మి, ఉషారాణి, మమతా,ధనలక్ష్మి,సుష్మిత,దివ్య, కొమురమ్మ, ప్రమీల, జానకి,రోజా,పద్మ,సరితా, మాధవి,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత సేవా పక్షోత్సవాలలో విస్తృతంగా పాల్గొనాలి

**పరిసరాలు పరిశుభ్రత పెట్టుకోవాలి.**
**మొక్కలను నాటాలి.**
**విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందాలి.**
**అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలి.**
**జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.**



ఏటూరునాగారం(ములుగు) (గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: స్వచ్చత సేవా పక్షోత్సవాలలో విస్తృతంగా పాల్గొని పరిసరాలు పరిశుభ్రత, మొక్కల నాటి సంరక్షించడం చేయాలని జిల్లా కలెక్టర్దివాకరటి.ఎస్.అన్నారు. గురువారం ములుగు మండలంలోని మల్లంపల్లి పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా గ్రామీణాభివృద్ధి



శాఖ ఆధ్వర్యంలో స్వచ్చత సేవా హీ కార్యక్రమం క్రింద నిర్వహించిన ఇండోర్ గేమ్స్ చెస్ క్యారమ్స్ పోటీలలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. విద్యార్థులతో స్వచ్చతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత పెట్టుకోవాలని అన్నారు. ప్రభుత్వం విద్యకోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే అన్నారు. విద్యార్థులకు లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఆ దిశగా చదువు సాగించాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులకు క్యారియర్ గైడెన్స్ ఒరిఎంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం అందిస్తున్న తీరును అడిగి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరగాలని సూచించారు. అంతకు ముందు మల్లంపల్లి గ్రామపంచాయితీ ఆవరణంలో ఉన్న మార్కెట్ స్థలంను, పశువుల సంత స్థలం ను, అనంతరం జంగలపల్లిలోని మార్కెట్ స్థలంను, పశువుల సంత స్థలంను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఉన్న షేడ్ లను ఉపయోగంలోకి తీసుకొని రావాలని సూచించారు. రోడ్డు మీద పేదవారు చిన్న చిన్న టెంట్లు వేసుకొని వ్యాపారం చెయడం వలన ట్రాఫిక్ అంతరాయం జరుగుతుందని, అమ్ముకొని వారికి ఇబ్బందులు కలగకుండా అదనంగా షెడ్స్ నిర్మిచుటకు ఎన్ని షేడ్స్ అవసరం ఉన్నవి ప్రతిపాదనలు సమర్పించాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా ఇంకుడు గుంతలు నిర్మించాలని, మార్కెట్ పశువుల సంత స్థలంలలో మొర్రం వేయించి చదును చేసి, చుట్టూ స్టెన్చ్ కొట్టించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు, పాఠశాల హెచ్ఎం తిరుపతి, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ రాజి, ఎస్ బి ఎం జిల్లా కోఆర్డినేటర్ షర్ఫున్నీషా, పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పిసా గ్రామసభలో పునరుద్దించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలి



పోలవరం (గౌతమ్ న్యూస్): పిసా గ్రామసభలో పునరుద్దించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రం లో కమిటీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ఆదివాసి గిరిజన సంఘం జిల్లా జిల్లా అధ్యక్షులు తెల్లం.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరావు,గిరిజన సంఘం మండల కార్యదర్శి కారం భాస్కర్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 24వ తేదీ నుండి అన్ని ఐటిడిఏ పరిధిలో ఉన్న షెడ్యూల్డ్ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించటానికి పిసా, గ్రామ కమిటీలు పునరుద్దానికి ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఆ ఉత్తర్వులు ప్రకారం ఈనెల 24వ తేదీ నుండి పీసా గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలోని కోట రామచంద్రపురం ఐటిడిఏ పరిధిలో గ్రామలో పిసా గ్రామకమిటీలు ఏర్పాటు చేయటానికి షెడ్యూలు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పీసా గ్రామసభ నిర్వహించడం కోసం ఉన్నత అధికారులు జోక్యం చేసుకోవాలని సూచించారు.

## పట్టణంలోని సమస్యల గురించి మంత్రికి వివరించిన ఎండి షాకీర్



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): రాష్ట్ర సినీయర్ నాయకుడు..ఎండి.షాకీర్ గురువారం రాష్ట్ర ఐటీ మరియు ఇండస్ట్రీ శాఖల మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబుని కలిశారు. అనంతరం వారితో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేయడానికి గైనకాలజిస్టులు మరియు ఎమ్.ఎస్,ఎం.డి జనరల్ సర్జన్లు లేక ప్రజల చాలా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు.అలాగే మున్సిపల్ కార్యాలయంలో కూడా సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని దీనివలన సరియైన శానిటేషన్ జరగకపోవడం వలన ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడుతున్నారని, అలాగే పోలీస్ స్టేషన్ నందు బదిలీలపై సిబ్బంది వెళ్లడం వలన స్టేషన్ నందు సిబ్బంది కొరత ఏర్పడిందని. అలాగే పట్టణము కూడా మెట్పల్లి అభివృద్ధి చెందుతున్న క్రమంలో కొత్త బస్టాండ్,పాత బస్టాండ్ మరియు వెల్లుల్ల రోడ్డు, డిపో ఏరియాలలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుందని తెలిపారు. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయంలో సిబ్బంది కొరత ఏర్పడకుండా చూడాలని మంత్రి శ్రీధర్ బాబుని కోరారు. దీనికి మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించినట్లు షాకీర్ తెలిపారు. అనంతరం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు

## వయోవృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.**



ఏటూరునాగారం(గౌతమ్ న్యూస్): ములుగు జిల్లా స్టాపర్: వచ్చే నెల 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. కోరారు. గురువారం కలెక్టర్ తన ఛాంబర్లో వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ దివాకర టి . ఎస్. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని వృద్ధాశ్రమాల్లో వయోవృద్ధులకు ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తున్నామని, వృద్ధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని మానసిక ఉల్లాసం పొందాలని సూచించారు. వయోవృద్ధుల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, గ్రాండ్ పేరెంట్స్ డే, వాక్ థాన్ కార్యక్రమాల్లో వృద్ధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, ఇన్చార్జి శిరీష, వయోవృద్ధుల సంక్షేమ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం (టఫ్) మండలశాఖ ఎన్నిక



నల్లబెల్లి (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం నల్లబెల్లి మండల శాఖ అధ్యక్షులుగా మలిదశ ఉద్యమకారుడు తంగెళ్ల భాస్కర్ మరియు ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ కుమారస్వామి కోశాధికారిగా ఓదెల రవి అధికార ప్రతినిధిగా పల్లికొండ రవి లను టఫ్ జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్, రాష్ట్ర నాయకులు ఆకుల సాంబరావు నల్లబెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలోఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు తంగేళ్ల భాస్కర్ మాట్లాడుతు ఉద్యమకారుల హక్కులు నెరవేరేదాకా నిరంతరం కృషి చేస్తానని మండలంలోని తెలంగాణ ఉద్యమకారులను సంఘటితం చేసి తెలంగాణ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 250 చదరపు గజాల ఇంటి స్థలం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పెన్షన్ సౌకర్యం లాంటి పథకాలను వర్తింపజేసేదాకా పోరాటాన్ని ఉదృతం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు అనగారిన వర్గాల అధ్యక్షుడు పరికి కోర్నేల్ మాదిగ, తెలంగాణ ఆకలి కేకల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు బొట్ల పవన్, గోనెల నరహరి, మామిండ్ల చిన్న ఐలయ్య, కొత్తగట్టు ప్రభాకర్, పల్లికొండ రవి, ఓదెల రవి, బొట్ల సారయ్య, పెద్ద బోయిన కొమురయ్య, నానభోయిన పోషాలు తదితరులు పాల్గొన్నారు.

# దళిత పూజారి ఘన సన్మానం



నల్లబెల్లి (గౌతమ్ న్యూస్): నల్లబెల్లి మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో దళిత పూజారి గాదపాక స్వామి గారికి భక్త మండలి ఆధ్వర్యంలో ఘన సన్మానం చేయడం జరిగింది... ఈ సందర్భంగా సాయి బాబా దేవాలయం ప్రధాన పూజారి జీవన్ స్వామి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖ ఆధ్వర్యంలో 1083 కిలోమీటర్ల నూతన రైల్వే మార్గం ఏర్పాటుకు నిధులు కేటాయించినందున గాదెపాక రాముల స్వామి గత 20 సంవత్సరాల నుండి భద్రాద్రి పుణ్యక్షేత్రనికి రైలు మార్గం ఏర్పాటు చేయాలని మౌన దీక్షలు యాగాలు పాదయాత్రలు యజ్ఞలు అధికారులకు వినతి పత్రం సమర్పించడం తదితర అంశాలతో అనేక రూపాలలో స్వామి వారి కృపతో కార్యక్రమాలు నిర్వహించినందున అట్టి భద్రాది పుణ్యక్షేత్రానికి రైలు మార్గం ఏర్పాటు చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి అఖిలభారత హనుమాన్ ప్రచారకులు గాదపాక రాముల స్వామి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి చాలువాతో ఘన సన్మానం చేయడం జరిగినది అనంతరం సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం జరిగే అన్నదాన కార్యక్రమం లో భాగంగా పట్టణ కేంద్రానికి చెందిన మురళి స్టూడియో అండ్ ఫ్లెక్స్ ప్రింటింగ్ అధినేత రాధిక మురళి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఇట్టి అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



## ఎంపీడీవోలకు వినతి పత్రం అందజేసిన మండల మాజీ సర్పంచ్ లు...



నల్లబెల్లి(గౌతమ్ న్యూస్): మాజీ సర్పంచులకు పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సర్పంచ్ల ఫోరం. సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలాని వారు డిమాండ్ చేశారు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈరోజు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఎంపీడీవోలకు వినతిపత్రం ఇవ్వడం జరిగినది రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్న పార్లమెంటు ఎన్నిక ల్లో ముందు సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఈరోజు వరకు ఒక్క రూపాయి కూడా మాజీ ప్రజాప్రతినిధులకు సర్పంచులకు గ్రామపంచాయతీలకు ఇవ్వడం లేదు గ్రామాలలో ఐదు సంవత్సరాలుగా సేవ చేసి అభివృద్ధి చేసి ఆర్థికంగా చిదిగిపోయిన మమ్మల్ని వేధింపులకు గురి చేయకుండా తక్షణమే ఈ ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి లేనిచో భవిష్యత్తులో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోవడంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను కూడా అడ్డుకుంటామని తెలియజేస్తున్నాము రేపు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమా నిర్వహించి కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేస్తాం ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి లేనిచో రాష్ట్రస్థాయిలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలియజేయడం జరిగింది.... ఈ కార్యక్రమంలో అన్ని మండలాల మాజీ ప్రజా ప్రతినిధులు జెడ్పిటిసిలు ఎంపీపీలు సర్పంచ్లు ఎంపీటీసీలు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు...

# కుంటల్ల అంగన్వాడి కేంద్రంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



టేకులపల్లి(గౌతమ్ న్యూస్): ఐసిడిఎస్ టేకులపల్లి ప్రాజెక్ట్ టేకులపల్ల సర్కిల్ కుంటల్ల - అంగనవాడి కేంద్రంలో పోషణమాసం జరుగుతున్న సందర్భంగా కుంటల్ల అంగన్ వాడి కేంద్రంలో అక్షరాభ్యాసాలు నలుగురు పిల్లలకు చేయించటం జరిగింది. కార్యక్రమునికి సూపర్ వైజర్ అనురాధగారు పిఎస్ హెచ్ఎం సుశీల తల్లులు హాజరు అయినారు.సూపర్ వైజర్ మాట్లాడుతూ గర్భవతులు పోషకాహారం తినాలని తెలియజేశారు, అంగన్ వాడిలో పిల్లలకు ఆటపాటలద్వారా చదువు నేర్పుతారని తెలియ జేశారు .చిరుదాన్యాలు వాటిలో పోషక విలువల గురించి తెలియ జీయనైనది. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు కె. శకుంతల బి. జ్యోతి, ఈ అనసూర్య తదితరులు పాల్గొన్నారు.


## సాకలి ఐలమ్మ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో సాకలి ఐలమ్మ గారి 129వ జయంతి వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కాలేజీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. సాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే అనంతరం కాలేజీ లొ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులతో కలిసి అక్కడున్న సమస్యలు అడిగి తెలుసుకొని వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని సదరు అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలొ ఇల్లందు డి.ఎస్.పి చంద్రబాను ఎస్ఐ పి. సురేష్ , కార్యదర్శి యు . దీప్తి ,కాలేజీ ప్రిన్సిపాల్ స్టాఫ్ మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్ , ఇస్లావత్ రెడ్యానాయక్, బోడ మంగీలాల్ నాయక్, మూడ్ సంజయ్ నాయక్, ఈది గణేష్, మోకాళ్ళ పోషాలు, భద్రు నాయక్, గడ్డం మధు రెడ్డి, భూక్యా సర్దార్ నాయక్, రవి నాయక్, గుడిపూడి కృష్ణయ్య,, అజ్మీర శివ, భూక్యా ఈశ్వర్, బొడ్డు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## హైవే బాధితులకు అండగా ఉంటా అధైర్య పడకండి

**ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య**



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): గురువారం టేకులపల్లి బోడు క్రాస్ రోడ్ , నేషనల్ హై వే, వై జంక్షన్ ఆర్ - బి రోడ్ వెడల్పు ప్రక్రియలో భాగంగా స్థానిక సుమారు 10 పేద కుటుంబాల ఇండ్లు పోయే పరిస్థి ఉండడంతో ఆ విషయాన్నీ స్థానికులు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకుపోవడంతో, ఎన్ హెచ్ , డి ఈ , ఈ ఈ అధికారుల ను తక్షణమే పిలిపించి అక్కడ జరుగుతున్న నష్టాన్ని వివరించడం జరిగింది. ఇల్లు కోల్పోతున్న పేదలకు అండగా ఉంటానని, ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోరం సురేందర్, ఇస్లావత్ రెడ్యానాయక్, బోడ మంగిలాల్ నాయక్, మూడ్ సంజయ్ నాయక్, ఈది గణేష్, మోకాల పోషల్ , బొడ్డు అశోక్, బుర్ర ధర్మయ్య గౌడ్ వల్లాల కృష్ణ గౌడ్, అంబాల యాదగిరి గౌడ్, రాములు బాదావత్ మంగిలాల్ నాయక్, రవి గుడిపూడి వీరయ్య,ఇల్లందు డిఎస్పి చంద్రబాను, టేకులపల్లి ఎస్ఐ పి .సురేష్, గృహ సముదాయం కోల్పోతున్న యజమానులు పాల్గొన్నారు.





## యూట్యూబ్ న్యూస్ చానల్స్ యాజమాన్యాల నూతన కమిటీ మహాసభకు అందరికీ ఆహ్వానం

**మన ఐక్య పోరాటమే మనకు బలం బలగం....**
**సీఎం రేవంత్ రెడ్డి కి మెమొరాండం**
**తెలంగాణ స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్**
**వ్యవస్థాపక అధ్యక్షులు టైగర్ ఆలీ నవాబ్**




మహబూబాబాద్ బయ్యారం(గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా 33 జిల్లాల నుంచి మొట్ట మొదటి సారిగా నల్లగొండ జిల్లా నార్కెట్ పల్లిలో 29 జరిగే మహాసభ యూట్యూబ్ న్యూస్ చానల్స్ యాజమాన్యాల నూతన కమిటీని ఏర్పాటు చేయాలన్న ఆలోచన వచ్చిన పీవీసీ న్యూస్ ఛానల్ ఛైర్మెన్ టైగర్ పురం సంతోష్ కుమార్ ఆలోచన విధానంతో తెలంగాణ రాష్ట్రం వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఫోరం అధ్యక్షులు, టైగర్ అలీ నవాబ్ పోలీస్ నజర్ న్యూస్ ఈ సిక్స్ న్యూస్ బిజెపి న్యూస్ పబ్లిక్ నాగయ్య న్యూస్ ఛానల్ మేనేజ్మెంట్ టైగర్ ఆలీ నవాబ్ గురువారం రోజున ఆయన జాతీయ ప్రధాన కార్యాలయం తార్నాక నుంచి విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా టైగర్ అలీ నవాబ్, మాట్లాడుతూ యూట్యూబ్ న్యూస్ చానల్స్ నీ చిన్న చూపు చూసే వారికి రాబోయే రోజుల్లో మా చానల్స్ ప్రభంజనం ఎలా ఉంటుందో చూపిస్తానని,మా జర్నలిస్టు హక్కుల కోసం నిరంతరం టైగర్ పురం సంతోష్ కుమార్ ఐక్యతతో పరిష్కార మార్గానికి కృషి చేస్తామని,ఇప్పటికే రాష్ట్ర నలుమూలల నుంచి మా ఛానల్ యాజమాన్యాలు భారీ సంఖ్యలో తరలివస్తున్నారని ఈ యొక్క మహాసభను విజయవంతం చేయాలని కోరారు



## విధుల ఆటంకం పై వ్యక్తి పై రెండు కేసులు -ఎస్ఐ తిరుపతి



బయ్యారం(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం ,మండలంలో ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం చేసి దూషణలు చేసినందుకు దారావత్ మోహన్ పై రెండు కేసులు నమోదు చేసినట్లు బయ్యారం ఎస్ఐ తిరుపతి గురువారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం13.08.2024 ఏ ఎన్ ఎమ్ (ప్రభుత్వ ఉద్యోగి) తన విధులకు,ఆటంకపర్చి,బూతులు తిట్టి అవమాన పరిచినట్లు మహిళ బయ్యారం ఎస్ ఐ పిర్యాదు చేసినట్లు తెలిపారు. పిర్యాదు చేసిన కేసు కోసం దర్యాప్తు లో భాగంగా నేరస్థుల పంచనామా, సాక్షుల విచారణ చేస్తుండగా,అధికారి ,చట్టపరమైన విధులను అడ్డగిస్తూ, చచ్చిపోతానంటూ బెదిరించగా సెక్షన్ 226 బిఎన్ ఎస్ ప్రకారం మరొక కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు .దీనితో ఆవ్యక్తి రెండు కేసుల్లో నిందితుడని,అతనిని అరెస్ట్ చేసినట్లు ఎస్ ఐ తెలిపారు.

## జీవో నెంబర్ 25 రద్దు చెయ్యాలని పెండింగ్ బిల్స్ విడుదల చెయ్యాలని

**ఎమ్మెల్సీ రగొత్తం రెడ్డి కి వినతి పత్రం అందజేత.**




బయ్యారం,(గౌతమ్ న్యూస్): హైదరాబాదులోని పిఆర్టియు భవన్లో రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి ని, పిఆర్టియూ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రగోత్తం రెడ్డి ని రాష్ట్ర బాధ్యులను కలిసి ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీవో నెంబర్ 25 ను రద్దు చేయాలని పెండింగ్లో ఉన్న బిల్స్ తొందరగా వచ్చేలా చూడాలని బయ్యారం పిఆర్టియూ మండల అధ్యక్షులు మోహన్, రామారావు వారిని కోరడం జరిగింది.వారు సానుకూలంగా స్పందించి అన్ని సమస్యలను అతి త్వరలోనే పరిష్కరిస్తామని తెలుపుతూ బయ్యారం మండల నూతన అధ్యక్షులు మోహన్ నాయక్ ని,రామారావు ని సత్కరించడం జరిగిందని వారు తెలిపారు.



## భిక్యా తండా గ్రామపంచాయతీ పరిధిలో సేవాలాల్ జగదాంబ దీక్షలు



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట మండలంలోని భిక్యా తండా గ్రామపంచాయతీ పరిధిలో సేవాలాల్ జగదాంబ గుట్ట ఆలయంలో సేవాలాల్ జగదాంబ దీక్షలు 23 మంది మహారాజులు దీక్షలు ధరించుకోవడం జరిగింది. ఈ దీక్ష 21 రోజు కొనసాగుతుంది ఈ దీక్ష దారులు ఉదయం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు సేవాలాల్ భవాని మాత ముక్కోటి దేవతల పూజ చేస్తూ నామ స్మరణంలో ఉంటారు. ఉదయం 6 సమయంలో భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహిస్తారు. 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఎలాంటి ఆహారము తీసుకోకుండా మంచినీళ్లు కూడా ముట్టకుండా దీక్ష దారులు దేవతల ధ్యానంలో ఉంటారు. 21 రోజులు పూర్తయిన తర్వాత మహారాష్ట్రలోని పౌరాదీవిలో దీక్ష విరమణ చేస్తారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ జగదాంబ ఆలయ వ్యవస్థాపకులు మూడ్. సూర్యం చౌహన్, గురు మహారాజ్ మునోత్ రవి నాయక్ తిరుపతి మహారాజ్, శ్రీనివాస్ చౌహన్ మహారాజ్, వస్త్రం మహారాజ్, కుమార్ మహారాజ్, నినావత్ సాలి రామ్ మహారాజ్, సంతోష్ మహారాజ్, ప్రవీణ్ మహారాజ్, తదితరులు మహారాజులు మరియు కన్నె మహారాజులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీసీ రాగం!!

## రాజ్యాధికార దిశగా బీసీలు!! 2028లో బీసీ ప్రభుత్వం ఏర్పాటు లక్ష్యంగా ఉద్యమాలు!! మోచేతి నీళ్లు తాగుతున్న బిసి నాయకులు మేల్కోవాలి !!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): చట్టసభల్లో ఉద్యోగ ఉపాధి రంగాల్లో రోజురోజుకు నెట్టివేయబడుతున్న బీసీ జాతులను ఏకం చేసి 2028 సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి పీఠం ఎక్కడ ఖాయమని ఈ దిశగా తెలంగాణ రాష్ట్రంలో ఈ మధ్యకాలంలో బీసీ నినాదం మారు మోగుతుంది, తెలంగాణ రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో 17 పార్లమెంటు నియోజకవర్గం అత్యధికంగా అగ్రవర్ణాలైనా వెలమా , రెడ్లు చట్టసభల్లో అత్యధికంగా ఉన్నారు, కేవలం 6% జనాభా ఉన్న అగ్రవర్ణాలు రాజకీయంగా చట్టసభల్లో ఉద్యోగ రంగాలలో సామాజికంగా రాజ్యమేలుతున్న తరుణంలో ఎంతకాలం బీసీల అణచివేత కొనసాగుతుందని భావించిన బీసీ కులాలకు చెందిన ప్రజలను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏకం చేసి ఓట్లు మావి సీట్లు మీకా అంటూ



బీసీ రాగం రాష్ట్రంలో బలంగా తీసుకపోవడానికి రాష్ట్రంలోని బీసీ సంఘాల నాయకులు కంకణం కట్టుకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా రాజకీయ విశ్లేషకుల ద్వారా తెలుస్తుంది, 80% ఉన్న బీసీ జనాభా అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని ముఖ్యంగా ఉద్యోగ రంగాలలో రాజకీయ రంగాలలో అట్టడుగున మరుగున పడిపోతున్నారని ఇప్పటికే ఎక్కడ చూసినా చర్చనీయసంగా మారింది, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు బీసీలకు శాపంగా మారుతున్నాయని జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను చట్టసభలో ఉద్యోగ రంగాలలో అమలు చేయకుండా కేవలం 6% జనాభా కలిగిన అగ్రవర్ణాలు వెలమ, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు ఆధిపత్యం కొనసాగిస్తున్నారని



రాజకీయంగా ఎదగకుండా ఉద్యోగ రంగాలలో రాణించకుండా బీసీలను అనగదొక్కే ప్రయత్నం చేస్తున్నా పాలక ప్రభుత్వాలకు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పక తప్పదని ఇటీవల సీనియర్ జర్నలిస్టు వివిధ టీవీ చానల్ లో పనిచేసిన తీన్మార్ మల్లన్న అంటేనే తెలంగాణ రాష్ట్రంలో ఒక ఉత్సాహతమైన వాతావరణం ఆయన వార్తలు ఆయన కథనం టుడే సపరేట్ అలాంటి బీసీ నాయకుడు సామాజిక వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పుంజుకున్నది, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన తీన్మార్ మల్లన్న ఇటీవల జరిగిన బీసీ రాజకీయ చైతన్య వేదిక సభలో



చేసిన ప్రకటన రాజకీయ నాయకులలో అధికార పార్టీలో గుబులు లేపింది, ఈ రాష్ట్రాన్ని మరో 20 సంవత్సరాల పాటు మేమే పరిపాలిస్తామని ఒకపక్క టిఆర్ఎస్ మరోపక్క కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రకటనలు జీర్ణించుకోలేని తీన్మార్ మల్లన్న బీసీ నినాదాన్ని భుజాన పెట్టుకొని ముందుకు సాగుతున్నట్లు తెలుస్తుంది, బీసీలు అంటే బ్యాక్ బోన్ గా మారబోతున్నారని



రాబోయే రోజుల్లో రాజ్యాధికారం బీసీలకే దక్కుతుందని కుండబద్దలు కొట్టారు, ఈ తెలంగాణ రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాబోతున్నారని ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి కావడం తథ్యమని అన్నారు, తీన్మార్ మల్లన్న ప్రకటనతో తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకున్నాయి, తెలంగాణ రాష్ట్రంలో బీసీ సమగ్ర కులకన చేపట్టి 42% రిజర్వేషన్లను అమలు చేయించే బాధ్యత తాను తీసుకుంటానని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ప్రకటించిన నేపథ్యంలో బీసీ కులగలను వెంటనే చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇచ్చేవరకు తాను పోరాటం చేస్తానని తీన్మార్ మల్లన్న ప్రకటించారు, ఈ రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జనాభా ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు, బీసీలకు శాపంగా మారిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే పునర్ పరిశీలించాలని అంతవరకూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికి సిద్ధమైన కూడా తెలుస్తుంది, జనాభాలో శాతం ఉన్న ఓసీలు ఉద్యోగ రాజకీయాలలో 10 శాతం రిజర్వేషన్ అనుభవిస్తున్నారని అత్యధికంగా జనాభాన్న బీసీలు మాత్రం రిజర్వేషన్లకు దూరమైపోతున్నారని తీన్మార్ మల్లన్న చెప్పకనే చెప్పారు, ఈ రాష్ట్రానికి ఆఖరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాబోతున్నారని కూడా ఆయన ప్రకటన తెలంగాణ బీసీలలో చైతన్యాన్ని పుట్టించింది, అంతేకాక అడుగు అడుగున బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందని బీసీల్లో నిరుపేద ప్రజలు అవమానానికి గురవుతున్నారని అన్ని భరించుకుంటూ ఇంతకాలం ఉన్న బీసీలు ఒక్కసారిగా ఏకం కావడానికి సిద్ధమైన తెలుస్తుంది, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో ఒకప్పుడు జడ్చర్ల శాసనసభ నియోజకవర్గంలో 1994లో టిడిపి నుంచి గెలుపొందిన బిసి పులిబిడ్డ టైగర్ స్వర్గీయ మాజీ ఎమ్మెల్యేఎర్ర సత్యం అలియాస్ మరాఠీ సత్యనారాయణ బిసి నాయకునిగా ఎదుగుతున్న తరుణంలో అగ్రవర్ణాలు పట్టపగలు ఒక కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ ఎర్ర సత్యం ను



తుపాకీ తూటాలతో పోలీస్ డిపార్ట్మెంట్లో పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ మాధవరెడ్డి కాల్చి చంపి పొట్టన పెట్టుకున్నారు, అప్పట్లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాల్లో తిరుగులేని బీసీ నాయకుడుగా ఎదిగిన బలమైన నాయకుడు ఎర్ర సత్యం మరణం ఇప్పటికీ బిసి ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు, జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలో అనేకసార్లు తిరుగులేని మెజార్టీ సాధించి అగ్రవర్ణాల గుండెల్లో గూడు కట్టుకొని నిద్రపోయిన ఎర్ర సత్యం అలియాస్ మరాఠీ సత్యనారాయణ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణలో బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా తీన్మార్ మల్లన్న కంకణం కట్టుకున్నట్లు తెలుస్తుంది, బీసీ జాతులపై వివక్షత పై జీర్ణించుకోలేని ఎర్ర సత్యం రాజకీయంగా ఎదగకుండా దారుణంగా హత్య చేసిన సంఘటన ఒకసారి గా అందరిని కలిసి వేసింది, ఎర్ర సత్యం సిద్ధాంతాలను ఆశయాలను తూచా తప్పకుండా నెరవేర్చి దిశగా ఉద్యమాలను కొనసాగించడానికి తీన్మార్ మల్లన్న తో పాటు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆంధ్ర ప్రదేశ్ రాజ్యసభ సభ్యుడుగా కొనసాగుతున్న ఆర్ కృష్ణయ్య తన పదవికి రాజీనామా చేసి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ముందుకు సాగుతున్నట్లు బిసి సంక్షేమ సంఘం నాయకులు అంటున్నారు, 1994లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన ఆర్ కృష్ణయ్య 2014 ఎన్నికల్లో టిడిపి పార్టీ నుంచి ఎల్బీనగర్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు, బిసి ఉద్యమాన్ని భుజాన పెట్టుకొని అప్పటినుంచి నేటి వరకు ఆర్ కృష్ణయ్య అనేక ఉద్యమాలు ఆందోళన కార్యక్రమాలు చట్టసభల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై నిలదీసి ప్రశ్నించారు, చట్టసభలో 50% రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టి బీసీ కులాలకు చట్టసభల్లో న్యాయంగా దక్కవలసిన రిజర్వేషన్లను దక్కించుకునే వరకు పోరాటం కొనసాగిస్తానని ఆర్ కృష్ణయ్య ముందుకు వస్తున్నట్టు తెలుస్తుంది, బీసీల హక్కుల సాధన కోసం బలమైన ఉద్యమాన్ని చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని ఇందుకోసం ప్రతి ఒక్కరు బిసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని మారుమూల ప్రాంతం నుంచి గల్లీ నుంచి ఢిల్లీ వరకు బిసి ఉద్యమాలను చేపట్టి అసెంబ్లీ, పార్లమెంటు చట్టసభల్లో 50% రిజర్వేషన్లు సాధించుకునే వరకు తమ పంతం తమ లక్ష్యం కొనసాగుతుందని ఆర్ ,కృష్ణయ్య కంకణం కట్టుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు ద్వారా బీసీ సంఘాల నాయకులు ద్వారా తెలుస్తుంది, ఇందుకోసం దేనికైనా ఎంతటికైనా త్యాగం చేయడానికి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆర్, కృష్ణయ్య భీష్మించుకున్నట్టు తెలిసింది, అవసరం అనుకుంటే తెలంగాణలో కొత్త పార్టీని స్థాపించే దిశగా అడుగులు ముందుకు సాగుతున్నాయని, రాజకీయ అధికారం దక్కినప్పుడే బీసీలకు సమాజంలో గౌరవం దక్కుతుందని బీసీలను చైతన్య వంతులను చేయుటకు ప్రతి ఒక బిసి పౌరుడు కృషి చేయాలని ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు, తెలంగాణ రాష్ట్రంలోనే కాక ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలలో బీసీ నాయకులను రాజకీయంగా ఎదగకుండా తొక్కి పెట్టి బీసీల ద్వారానే బీసీ నాయకులను వివిధ రూపాలలో రాజకీయ హత్యలు చేసి రాజకీయంగా అణచివేస్తున్నారని విమర్శలుస్తున్నాయి, ముఖ్యంగా ఈ మధ్యకాలంలో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీసీ నాయకులు రాజకీయంగా మానసికంగా శారీరకంగా వేధింపులు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి, సుదీర్ఘకాలం క్రితం కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీసీ నాయకుడుగా ఎదుగుతున్న సమయంలో కొల్లాపూర్ మాజీ సర్పంచ్ పి గౌతమ్ గౌడు ను నక్సల్స్ తో సంబంధాలు పెట్టుకుని కోట్ల రూపాయల డబ్బులు ఇచ్చి ఆయనను భార్య ముందే హత్య చేయించారని ఆరోపణలు ఉన్నాయి, ఆ తర్వాత బిసి నాయకుడుగా కొల్లాపూర్ నియోజక వర్గంలో గత కొన్ని సంవత్సరాలు నుంచి ప్రజా డాక్టర్ గా పగిడాల రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ గా పనిచేసి మహిళల కోసం ఉచిత గర్భిణి స్త్రీ పరీక్షలు ఉచిత ఆపరేషన్లు నిర్వహించి ప్రజా డాక్టర్ గా ప్రజల్లో పేరు పొందిన డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డి గత్యంతరం లేక ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న పగిడాల శ్రీనివాసరెడ్డిని కూడా రాజకీయంగా ఎదగకుండా అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయంగా పట్టు సాధించిన డాక్టర్ గా ప్రజల మనిషిగా పేరు పొందిన బీసీ నాయకుడు పగిడాల శ్రీనివాసరెడ్డి గత కొన్ని సంవత్సరాల నుంచి తెలుగుదేశం పార్టీలో పనిచేసి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు, కానీ ఆయన ఎదుగుదలను ఓర్వలేక ఇప్పటి నుంచే తొక్కి పెడుతున్నట్లు నియోజకవర్గంలోని ప్రజలు అంటున్నారు, అంతేకాక గతంలో పానుగల్ ఎంపీపీగా పనిచేసిన ముంత రాములు యాదవును కూడా ఎదగకుండా మానసికంగా ఇబ్బంది పెట్టడం వల్ల మంచం ఎక్కారు ఆయన పరిస్థితి కూడా అధ్వానంగా ఉంది, ఇదే మండలంలో బండపల్లి గ్రామానికి చెందిన రామ్మూర్తి నాయుడు కూడా రాజకీయంగా సీనియర్ బీసీ నాయకుడుగా ఎంతో కాలం నుంచి పనిచేసిన రాజకీయంగా ఎదగలేకపోతున్నారని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు, అదేవిధంగా కోడేరు మండలం మాజీ జడ్పిటిసి సభ్యులు సురేష్ గౌడ్ కూడా రాజకీయంగా ఎదుగుతున్న తరుణంలో మానక్షిక శోభకు గురిచేసి గుండెపోటు తో మరణించారు, కోడేరు మండలంలో ఎంతో పట్టుకు సాధించిన సురేష్ గౌడ్ మరణం ఇప్పటికీ బీసీ సామాజిక వర్గాలలో చర్చనీయాంశంగా మారింది, వీటితోపాటు వీపనగండ్ల మండలంలో గోవిందు గౌడ్, ఎత్తం కృష్ణయ్య, బీసీ నాయకులను కూడా రాజకీయంగా ముందుకు రాకుండా పరోక్షంగా కట్టడి చేస్తున్నట్టు తెలుస్తుంది, పెద్దకొత్తపల్లి మండలంలో కూడా బీసీ నాయకులుగా పేరుపొందిన కాంగ్రెస్ పార్టీ అప్పటి మాజీ మండల పార్టీ అధ్యక్షులు సొంట లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ మిరపకాయల శ్రీను కూడా రాజకీయంగా రాణించలేకపోయారు, వీరితోపాటు మరికొంతమంది బీసీ నాయకులు పెద్దకొత్తపల్లి మండలంలో రాజకీయంగా మండల స్థాయిలో మాత్రమే పనిచేస్తున్నారు, అందులో ప్రధానంగా పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్, సాతాపూర్ మాజీ సర్పంచ్ ప్రస్తుత సింగల్ విండో అధ్యక్షులు కట్ట రాజేందర్ గౌడ్, దేవుని తిరుమలపురం మాజీ సర్పంచ్ వి సత్యం కూడా రాజకీయంగా పోతున్నారని ఆ మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, కొల్లాపూర్ నియోజక వర్గంతో పాటు జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గం లో పోకల మనోహర్, మాకం తిరుపతయ్య, నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో బై కానీ శ్రీనివాస్ యాదవ్, కల్వకుర్తి నియోజకవర్గం లో బాలాజీ సింగ్, అనే బీసీ నాయకులు కూడా రాజకీయంగా ఎదగకుండా అణిచివేతకు గురి చేసి అనగా తొక్కుతున్నారని విమర్శలు వస్తున్నాయి, వనపర్తి నియోజకవర్గం లో కూడా మాజీ ఎమ్మెల్యే కుమారుడు ప్రజా డాక్టర్ భూపేష్ కుమార్, తోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ బి లక్ష్మయ్య, బి రాములు, జింకల కృష్ణయ్య ముదిరాజ్ తో పాటు మరి కొంతమంది బీసీ నాయకులు రాజకీయాల్లో ఎరుగకుండా చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి, దేవరకద్ర నియోజకవర్గంలో కాటం ప్రదీప్ గౌడ్, రాచాల యుగంధర్ గౌడ్, లో కూడా ఈ ప్రాంతంలో బీసీల్లో ఉన్నత శిఖరాలను చేరుకుంటున్న సమయంలో అలాంటి బీసీ నాయకులను కూడా రాజకీయ పదవులు తప్పకుండా కేసులు పెట్టడం వేధించడం వంటి అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆ నియోజకవర్గంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అంటున్నారు, ఈ విధంగా ప్రతి నియోజకవర్గంలో ఏదో ఒక సమస్యతో బీసీ నాయకులను ఎదగకుండా అణచివేయడం రాజకీయ హత్యలు చేయడం సర్వసాధారణమైంది, అందుకే తెలంగాణ రాష్ట్రంలో బీసీ ప్రభంజనానికి సృష్టించి అధికారమే లక్ష్యంగా బీసీలు చైతన్యం కావడానికి పక్క ప్రణాళికను రచించినట్లు విశ్వసనీయవర్గా తెలుస్తుంది, ఏమి జరుగుతుందో మరికొన్ని రోజుల్లోనే తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలలో ప్రకంపనాలు మొదలు కావడం ఖాయమని చెప్పవచ్చు, బీసీలు ఇప్పటికైనా ఏకతాటి పైన ముందుకు వస్తారా లేదా అనే సందిగ్ధత నెలకొన్నది కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం వ్యక్తిగత వ్యాపారాల కోసం బీసీ నాయకులే బీసీలకు శత్రువులుగా మారుతున్నారని చిన్న చిన్న పదవులు మండల స్థాయి పదవులు ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచ్ పదవులు ఆశించి బీసీ ప్రజల ఆత్మగౌరవని అగ్రవర్ణాల అగ్రవర్ణాల నాయకుల చేతుల్లో పెట్టి పబ్బం కట్టుకుంటున్న చోటామోటానాయకులను గ్రామాల నుంచి తరిమికొట్టే రోజులు త్వరలో వస్తున్నట్లు తెలుస్తుంది , ఇప్పటికైనా గ్రామాలలో మండలాల్లో బీసీ నాయకులుగా చలామణి ఆత్మగౌరవాణి చేతుల్లో తాకట్టుపెట్టి వత్తాసూ పలుకుతూ చెక్కభజన చేస్తున్న నాయకులకు ఇక సెలవు చిట్టి అంటున్నారు బీసీ సామాజిక వర్గం ప్రజలు, అతి తొందరలో తెలంగాణలో ఏమి జరుగుతుందో వేచి చూడాలి, ముఖ్యంగా బీసీ నాయకులు ఏకం కాకపోతే ప్రజా తిరుగుబాటుకు గ్రామాలు వదిలిపెట్టక తప్పదని కూడా తెలుస్తుంది, పూర్తి వివరాల కోసం వేచి చూడండి,8

## నూతన ఎంఈఓ, గా, బాధ్యతలు చేపట్టిన దేవేంద్రాచారి





బయ్యారం (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నూతన ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన దేవేంద్రాచారికి జిల్లా ఉపాధ్యాయ సంఘ నాయకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా సన్మానించారు. ఎంఈఓ బాధ్యత చేపట్టిన దేవేంద్రచారి ఏలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా కొనసాగాలని, అలాగే జిల్లా సంఘ నాయకుల సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్.యు.పి.పి టిఎస్ జాల్లా కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్, టి.టి.యు జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి భిక్షం, సి.పి.ఎస్.ఈ.యు మండల అధ్యక్షుడు బానోతు రవీందర్, పి.ఆర్.టి.యు జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, వివిధ సంఘల సభ్యులు.. రామేశ్వరరావు,లక్ష్మీనారాయణ,ధనుంజయ్, సుధాకర్,శ్రీనివాస్,లక్ష్మయ్య,అరుణ శోభ లు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో 347 వ రోజు అన్నదాన కార్యక్రమం



వరంగల్ (గౌతమ్ న్యూస్): యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో పరకాల పట్టణం , హనుమకొండ జిల్లాకు చెందిన ఎండి ఆసిఫా - ఫెరోజ్ దంపతుల కుమరుడు " ఎం.డి. అద్నాన్ పుట్టినరోజు " సందర్భంగా ఆటోనగర్ , వరంగల్ లో ఉన్న లూయిస్ ఆదర్శ బ్లైండ్ స్కూల్ లో ఉన్న చిన్నారులకు 347వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.డి. ఆసిఫా , ఎం.డి.ఫెరోజ్ , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వీ , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవి కుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## డైనమిక్ స్కూల్ అవార్డుకు ఎంపికైన మేధా కాన్సెప్ట్ స్కూల్




కాజీపేట(గౌతమ్ న్యూస్): ఈ న్యూస్ నెట్ వర్క్ వాళ్ళు కంప్యూటర్ ఎడ్యుకేషన్ విభాగంలో నిర్వహించే డైనమిక్ స్కూల్ అవార్డు 2023-24 సంహాత్సరానికి గాను హన్మకొండ జిల్లా కాజిపేట్ లోని మేధా కాన్సెప్ట్ స్కూల్ ఎంపికయింది. ఈ సందర్బంగా స్కూల్ డైరెక్టర్ డా. వి. మధుకర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని స్కూల్స్ లో ఈ అవార్డు ఎంపిక చేశారన్నారు.ఈ అవార్డు ను హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమం లో ఈ న్యూస్ నెట్ వర్క్ నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నామన్నారు. అవార్డు ఎంపికతో విద్యార్థులలో సృజనాత్మ, బోధన మరింత అందించే బాధ్యత పెరిగిందని డైరెక్టర్ మధుకర్ రెడ్డి తెలిపారు.

## హైబ్రిడ్ వర్క్ ప్లేస్ విధానంతో అందరికీ అవకాశాల సృష్టి



అమరావతి,: రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీని నేరవేర్చే విధంగా ప్రణాళికలతో పనిచేయాలని ఆయన సూచించారు. నైపుణ్య శిక్షణ శాఖ, ఎంఎస్ఎంఇ డిపార్ట్మెంట్, ఇండస్ట్రీస్, సెర్ప్ శాఖ అధికారులతో సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నైపుణ్య శిక్షణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన విధంగా మానవ వనరులు సమకూర్చాలని సూచించారు. నైపుణ్య పెంపు ద్వారా పెద్ద ఎత్తున అవకాశాలు పొందే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. హైబ్రిడ్ విధానంలో ఇంటి వద్ద నుంచే పనిచేసే కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బహుళజాతి కంపెనీలతో ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటు ప్రక్రియ చేపట్టాలని అన్నారు. విజయవాడలో వరదల్లో మునిగి సర్వం కోల్పోయిన బాధితులు తమకు ఉపాధి చూపించాలని కోరారని.. ఆ ప్రాంతంలో ఎటువంటి ఉపాధి కల్పన చేపట్టవచ్చనే అంశంపై పరిశీలన జరిపి కార్యాచరణ అమలు చేయాలని సిఎం అన్నారు. వివిధ కారణాలతో గ్రామాల్లో ఉండిపోయిన వారికి పనిచేసేందుకు అవసరమైన అవకాశాలను కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని, ప్రభుత్వం, పారిశ్రామిక వేత్తలు కలిసి ఈ పనిచేయాలని సీఎం అన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై యాక్షన్ ప్లాన్ తో రావాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, పలువురు పరిశ్రమ రంగ నిపుణులు పాల్గొన్నారు.

## ముంబయి నటి కేసు.. తప్పు చేసిన ఎవర్ని వదిలే ప్రసక్తే లేదు..



అమరావతి,: ముంబయి నటి కాదంబరి జిత్వానీ కేసులో ఇప్పటికే ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేశామని ఏపీ హెూం శాఖ మంత్రి వంగలపూడి అనితి వెల్లడించారు. ఈ కేసులో తప్పు చేసిన ఎవరినీ వదిలే ప్రసక్తే లేదన్నారు. కేసులో కేసులో కొంతమంది పోలీసులను విచారిస్తున్నామని మంత్రి చెప్పారు. విచారణ తర్వాత కొంతమంది పోలీసులపై చర్యలు ఉంటాయన్నారు పేర్కొన్నారు. ముంబయి నటి కేసును ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా సీరియస్‌గా తీసుకున్నారని మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. కాగా, హీరోయిన్ జిత్వానీ కేసు రాష్ట్రంలో కలకలం సృష్టించింది.. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు ఐపీఎస్ అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసిన విషయం విదితమే.. ఇక. ఈ కేసులో ఏ1గా ఉన్న కుక్కల విద్యాసాగర్ ను డెహ్రాడూన్‌లోని ఓ రిసార్ట్‌లో అరెస్ట్ చేసి విజయవాడకు తీసుకొచ్చిన విషయం విదితమే.. మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి.. విద్యాసాగర్ కు అక్టోబర్ 4వ తేదీ వరకు రిమాండ్ విధించిన విషయం విదితమే.ం

# గుహలు కాదు.. ప్రకృతి రమణీయత!

అమెరికాలో జులై నెలలో ఎండలు బాగానే ఉన్నాయి. వేసవి సెలవులు కావడంతో భాను మాగులూరి మరో నలుగురు మిత్రులతో కలిసి వర్జీనియాలో మా అమ్మాయి అనిత మన్నవ ఇంటి నుంచి లూరే కేవ్స్ ను చూడటానికి బయలుదేరి వెళ్లాం. అక్కడికి చేరడానికి మాకు సుమారు గంటకు పైగా పట్టింది. రహదారులు మొత్తం ఎత్తుపల్లాలు, చుట్టూ కొండలు, వాటిపై నుంచి జాలువారుతున్న సన్నటి నీటిపాయలు, దారిపొడవునా పచ్చదనం.. దీంతో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుంది. అమెరికాలో పర్యాటక ప్రాంతాలను బాగా అభివృద్ధి చేస్తారు. అవి పెద్దవా, చిన్నవా అనే తేడా లేకుండా వాటికో గుర్తింపు తీసుకువస్తారు. అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించి, సృజనాత్మక అనుభూతిని కలుగచేస్తారు. వాటికి అనుబంధంగా మాల్స్, మ్యూజియాలు ఏర్పాటుచేసి అనేకమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. వీటిపై వచ్చే ఆదాయంతోనే వాటిని అభివృద్ధి చేస్తారు. ఇక్కడ కార్లకు సంబంధించిన మ్యూజియం కూడా ఉంది. అతి పురాతమైన వాహనాలు ఇక్కడ ఉన్నాయి. దీంతో పాటు మరో మ్యూజియం కూడా ఉంది. ఈ గుహలు కనిపెట్టిన వారు



వినియోగించిన వస్తువులు ఇక్కడ ఉన్నాయి. ప్రకృతి ప్రేమికులను బాగా ఆకట్టుకునేలా కేవ్స్ పక్కనే ఒక కొలను, అందులో ఫౌంటేన్ ఏర్పాటుచేశారు. చుట్టుపక్కల ఎత్తైన కొండలు, పచ్చటి పరిసరాలు, ఎటువైపు చూసినా గ్రీన్ మ్యాట్ పరిచినట్లుగా ఆకుపచ్చ రంగులో సహజసిద్ధంగా దర్శనమిస్తుంటాయి. ఇక్కడ సీజన్ లతో పనిలేకుండా నిత్యం ఈ ప్రాంతం పర్యాటకులతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు పాఠశాలలకు సెలవులు కావడంతో పిల్లలతో కలిసి తల్లిదండ్రులు, ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. టికెట్ ఖరీదు 32 డాలర్లు. మన కరెన్సీలో దాదాపు 2,500. దీనికి తోడు పార్కింగ్ ఫీజు అదనం. మనకున్న పర్యాటక ప్రాంతాల గొప్పదనం మనకు కనిపించదు. బయట ప్రాంతాల్లో ఉన్న వాటిని చూసిన తర్వాతగాని మన పర్యాటక ప్రదేశాల విశిష్టత తెలుస్తుంది. మనదేశంలో అమెరికా కంటే గొప్ప గొప్ప పర్యాటక ప్రదేశాలు ఉన్నా, మన ప్రభుత్వాలు అంతగా పట్టించుకోవు. తూర్పు అమెరికాలో లూరే కేవ్స్ అతిపెద్ద గుహలు. అమెరికాలో పర్యాటకులు అత్యధికంగా సందర్శించే ప్రదేశంగా లూరే కేవ్స్ ప్రసిద్ధిగాంచాయి. నేచురల్ ల్యాండ్ మార్క్ గా అక్కడి ప్రజలు భావిస్తారు. శాస్త్రవేత్తలు చెబుతున్న దాని ప్రకారం లూరే కేవ్స్ 450 మిలియన్ సంవత్సరాల క్రితం ఉద్భవించాయి. కానీ వీటిని కనుగొన్నది మాత్రం ఆగష్టు 18వ తేదీ 1878. వర్జీనియా రాష్ట్రంలోని లూరే పట్టణానికి అపాలాచియన్ పర్వతాలకు పశ్చిమాన ఉన్న షెనాండో లోయలో ఈ గుహలు ఉన్నాయి. సముద్ర మట్టానికి 927 అడుగులు ఎత్తులో ఉన్నాయి. ఇవి వాషింగ్టన్ డీసీకి 100 మైళు



, వర్జీనియాకు 70 మైళ్ల దూరంలో ఉన్నాయి. వీటి మొత్తం పొడవు సుమారు 2 కి.మీలు ఉంటాయి. ఇవి 64 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. గుహల లోపల 12 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఇవి చలికాలంలో కూడా తెరిచే ఉంటాయి. 1974లో అమెరికా ప్రభుత్వం వీటిని సహజసిద్ధంగా ఏర్పడిన పర్యాటక ప్రదేశంగా గుర్తించారు(నేచరల్ ల్యాండ్ మార్క్).

డ్రీమ్ లేక్

ఇందులో ఒకచోట బ్రిడ్జ్ సహజసిద్ధంగా ఏర్పడినట్లు కనిపిస్తుంది. మరోచోట గ్రీన్ లేక్ లా కనిపిస్తుంది. దీనిని డ్రీమ్ లేక్ అని అంటారు. 2500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న లురే కేవ్స్ లో డ్రీమ్ లేక్ అనేది అతిపెద్ద నీటి సరస్సు. ఈ సరస్సు లోతు 18 నుంచి 20 అంగుళాల మధ్య ఉంటుంది. పైకప్పుపై ఉన్న సుందర దృశ్యాలు యథాతథంగా క్రింద ఉన్న నీటిలో అద్దంలోలా ప్రతిబింబిస్తాయి. అవి చూపరులకు యథాతథంగా క్రింద కూడా ఉన్నట్లు భ్రమింపచేస్తాయి. నీటిలో ఏమాత్రం కదలిక ఉండదు. అది లోతు తక్కువగా ఉన్నా అందాలను ఆరబోస్తున్నట్లు ఉంటుంది. ఇక్కడి నీరు నీలిరంగులో ఉంటుంది. ప్రతి ఏడాది 5,6 లక్షల మంది పర్యాటకులు ఈ కేవ్స్ ను సందర్శిస్తుంటారు. భూమి ఉపరితలానికి 164 అడుగుల లోతులో ఈ గుహలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల 80 అడుగుల ఎత్తులో ఉంటాయి. కొన్ని చోట్ల 7 అడుగుల ఎత్తులో మాత్రమే ఉంటాయి. ఒక ప్రాంతానికి కెథెడ్రేల్ అనే పేరు పెట్టారు. లోపల ఉన్న దృశ్యాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తాయి. కలల ప్రపంచంలోకి తీసుకువెళ్లి గొప్ప అనుభూతులు మిగులుస్తాయి.

యాంఫీ థియేటర్

గుహలోపల సహజసిద్ధంగా ఏర్పడిన ప్రకృతి అందాలతో పాటు సంగీతం కోసం పియానో లాంటి వాద్యాన్ని 1954లో ఏర్పాటు చేశారు. ఇది అత్యంత పెద్దది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులోకి ఎక్కింది. ఇక్కడి నుంచి వచ్చే సంగీత తరంగాలు 37 చోట్ల ప్రతిధ్వనిస్తాయి. ఇక్కడ ఫ్లాటోస్ గోస్ట్ 6 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇందులో లేక్ తరహాలో నీళ్లు ఉంటాయి. నీళ్లు నీలం రంగులో కనిపిస్తాయి. అందులో నాణేలను, కరెన్సీ నోట్లను వేస్తారు. దీనివల్ల వారి కోరికలు నెరవేరతాయని విశ్వాసం. ఆ కరెన్సీ ఇప్పటివరకు 1,180.368 మిలియన్ డాలర్ల విలువ వరకు ఉంటాయి. 1961 నుంచి ప్రతి పదేళ్లకోసారి వీటిని లెక్కిస్తారు.

డిస్కవరీ రూమ్

ఆండ్రూ, విలియం, బెంటింగ్ స్టెబిన్స్ తో పాటు క్వింట్ అనే బాలుడూ వేసవి కాలంలో ఆ ప్రాంతంలో సంచరిస్తున్నప్పుడు ఒక సింక్ హెూల్ నుంచి చల్లటి గాలి రావడాన్ని గమనించారు. దీంతో ఆ చల్లగాలి ఎక్కడ నుంచి వస్తుందోనని ఆ ప్రాంతం మొత్తం అన్వేషించారు. అక్కడున్నటువంటి సింక్ హెూల్ ను గుర్తించి ఆండ్రూ, క్వింట్ ఇద్దరూ ఒక తాడు సహాయంతో గుహలోకి దిగారు. అంత పెద్ద గుహను చూసి ఒక్కసారిగా వారు ఆశ్చర్యపోయారు. మరుసటి రోజు మరలా కొవొత్తులతో వచ్చి మొత్తం కలియతిరిగారు. అందులో నుంచి వస్తున్న చల్లగాలిని పైపుల ద్వారా వారి ఇంటికి ఏసీ లాగా ఏర్పాటుచేసుకున్నారు. ఇది ప్రపంచంలోనే మొదటి ఎయిర్ కండిషన్ గా గుర్తించారు. ఈ గుహల్లో పైకప్పు నుంచి నీటి చుక్కలు పడుతూ ఉంటాయి. వీటి నిర్మాణం కాల్షియం కార్బోనేట్ ద్రావణంతో మిశ్రమమై కార్బన్ డై యాక్సైడ్ విడుదల చేస్తాయి. వీటి ద్వారా స్ఫటిక రూపంలో స్థంభాల్లాగా ఏర్పడ్డాయి. అనేకచోట్ల మర్రిచెట్టు ఊడల రూపంలో దర్శనమిస్తాయి. ఇక్కడ కొత్త నిర్మాణం నిక్షేపాలు ప్రతి 120 సంవత్సరాలకు ఒక క్యూబిక్ అంగుళం చొప్పున పేరుకుపోతాయి. భూగర్భంలోని రాతిపొరల మధ్య రాపిడి కారణంగా ఇవి ఏర్పడ్డాయి. నీరు, రసాయనాలు, ఖనిజాలు కలవడంతో గుహ లోపల పసుపు, గోధుమ మరియు ఎరుపు రంగులలో అత్యంత ఆకర్షణీయంగా సుందరంగా కనిపిస్తున్నాయి. ఫ్లోస్టోన్ డ్రేపరీలు గుహ అంతటా విస్తరించి ఉన్నాయి. ఇందులో సారాసెన్ గుడారం ఒకటి. ఇది 50 అడుగుల పొడవులో ఉంటుంది. ఇక్కడి వందలాది నీటి ప్రవాహాల బేసిన్లు ఉన్నాయి. వాటిలో కొన్ని 50 అడుగుల లోతు వరకు ఉన్నాయి. వాటిలోని నీటిలో కార్బోనేట్ ఉంటుంది. ఇది తరచూ కాంక్రీషన్లను ఏర్పరుస్తుంది. వీటిని ముత్యాలు, గుడ్లు, స్నో బాల్స్ అని పిలుస్తారు. గుహలో నీటి పరిమాణం వేర్వేరు సీజన్లలో వేర్వేరుగా ఉంటుంది. లురే కేవ్స్ లో ఉన్న గదుల కొలతలు, వాటి రూపురేఖలు సులభంగా చెప్పలేము. కానీ ఈ సుందర దృశ్యాలు చూసినప్పుడు పర్యాటకులు అమితానందాన్ని పొందుతారు. ఇక్కడున్నటువంటి ప్రకృతి సోయగాలు పర్యాటకులకు మధురానుభూతిని కలిగిస్తూ అబ్బురపరుస్తాయి. ఇవన్నీ మనస్సుకు హత్తుకు పోయే దృశ్యాలు. అత్యంత అద్భుతంగా ఉండే ఈ ప్రకృతి రమణీయత పికాసో చిత్రాలను గుర్తుచేస్తాయి.

# అమ్మది.. ఆత్మగౌరవ పోరాటం!



2012 సెప్టెంబర్ మొదటివారం. వీరనారి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఒక ఆర్టికల్ రాయాలని ఐలమ్మ వారసులని కలిసే ప్రయత్నం చేశాను. ఐలమ్మ పెద్ద కొడుకు చిట్యాల సోమయ్య పెద్ద కొడుకు లక్ష్మీ నరసయ్య ఇంటికి వెళ్లాను. సుమారు 70 ఏళ్ల వయసు కలిగి ఉన్న ఆయన ఇంటి ముందు అరుగుపై కూర్చొని ఉన్నాడు. నేనూ యోగక్షేమాలు తెలుసుకుని ఐలమ్మ అమ్మ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఒక వ్యాసం రాయాలనుకుంటున్నాను. నీకు తెలిసిన విషయాలు చెప్పాలని.. అడగడంతో ఎట్లా చెప్పాలి అని మామ బదులిచ్చాడు. అప్పటికే పదేళ్లుగా వారితో నాకు అనుబంధం ఉంది. పార్టీ కార్యక్రమాలు ఉన్నాయని సమాచారం ఇస్తే చాలు, ఎన్ని పనులున్నా వదిలేసి వచ్చేవాడు. కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. ఆ సమయంలో నేను అడిగిన కొన్ని ప్రశ్నలకు లక్ష్మీ నరసయ్య సమాధానం ఇస్తూ చాలా సేపు కబుర్లు చెప్పాడు. వాటిలో కొన్ని మాటలు ఇవి..

ఎర్రజెండా పేరు చెబితే చాలు కరిగిపోయేది!

మా గురించి ఎట్లా చెప్పుకుంట. నలుగురు చెప్పాలె. అమ్మ ఏంటో నాయకులు సెబుతుంటే విన్నం. అమ్మతో కలిసి బతికినప్పుడు ఆ గొప్పతనం మాకు అర్థం కాలే. సోది పెడుతుందని, అప్పటి ముచ్చట్లు చెబుతుంటే పట్టించుకోలే. అమ్మ ఎట్లా బతికిందో.. ఎన్ని కష్టాలు పడిందో.. ఎన్ని కన్నీళ్లను దిగ మింగిందో. ఎన్ని కడుపులో దాచుకుందో అమ్మకే తెలుసు. పురిటి నొప్పుల బాధ వాళ్లకే తెలుస్తది. గుమ్మిలో తిండి గింజలు లేకపోతే ఆకలి బాధ తెలుస్తుంది. అమ్మది ఆకలి పోరాటం, ఆత్మగౌరవ పోరాటం. మేము చిన్నతనంలో ఉన్నప్పుడు కమ్యూనిస్టు నాయకులు నలుగురు ఇంటికొచ్చి పోయే టోల్లు. ఎర్ర జెండా అంటే అమ్మకి ప్రాణం. ఆ ముచ్చట్లు చెబితే కోపంగా ఉన్న అమ్మ మనసు చల్లబడేది. కుదురుగా ఉండేది.

దొరల బెదిరింపునకూ తలొగ్గలే..!

బట్టలుతికిన, ఎద్దు ఎవసాయం చేసిన ఐదు వేళ్ళు నోట్లోకి పోయేది కాదు. చాంతాడంత కుటుం బం. అందరూ ఏదో పనిచేస్తేనే కాలం గడిచింది. అమ్మ పోరాటం చేసిందంట. ఎర్ర జెండాను ఇంటికి తీసుకువచ్చి సంఘం పెట్టిందంట. విసునూరు దొరోడికి తెలిసి కోపగించుకున్నడు. ఏమే.. ఐలమ్మ. ఆడదానివి. ఎట్ల బతుకుతావో.. చూస్తా, ఏమి చేస్తావో చూస్త అని బెదిరింపులు చేసిండట. భూమి పంచాయతీ పెట్టి బాధలు పెట్టిండు. అమ్మ నల్లగొండ కమ్యూనిస్టు నాయకుల దగ్గరికెల్లి కడుపులోని బాధను సెప్పుకుని వొచ్చింది. వాళు ఉకోలే.. మేమున్నామని ధైర్యం చెప్పిండ్రు. భరోసా ఇచ్చిండ్రు. సంఘం చిట్టి రాసిస్తే కొంగులో కట్టుకొని వచ్చింది ఐలమ్మ. అట్లా సాహసం చేసింది. మల్లంపల్లి దొర కుటుంబంకు పాలకుర్తిలో ఉన్న భూమిని కౌలుకు తీసుకుంది. నాలుగెకరాల్లో అమ్మ వరి పంటేసింది. గొప్పగా బతకాలె. నలుగుట్లో మంచిగా ఉండాలి అనే అమ్మ ఆలోచనలకు పాలకుర్తి పోలీస్ పటేల్ శేషగిరిరావు అడ్డుపడ్డడు. తన ఊరిలో తాను ఉండంగా ఈ ఎర్రజెండా పెట్టుడేంది. తనకు అవమానంగా భావించిండు. విసునూరు దొరోడి దగ్గరికెల్లి ఐలమ్మపై తొండి మాటలు చెప్పి వొచ్చిండు.

మా భూమి కావల్సి వొచ్చిందా దొరా?

పోలీసు పటేలు మాటలు నమ్మిన విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్ర రెడ్డి సంఘం నడవకుండా ముకుతాడు వేయాలనుకున్నడు. కుట్ర చేసిండ్రు. కుటుంబాన్ని ఇబ్బందులపాలు చేసిండ్రు. గీ దొరలకి మా భూమి కావల్సి వచ్చిందా? అయితే కారణం మరోటి ఉంది. ఇక్కడ అమ్మ సంఘం పెట్టింది. పాలకుర్తిలో దొరలను వ్యతిరేకించినోళ్లు ఒక కట్టు కట్టిండ్రు. దొరతనం పోవాలని.. రాకాసి పీడ పోవాలని.. ఎర్ర జెండా అందుకున్నరు. ఏకమై సాగిపోతున్నరు. అందుకే దొరలకు కడుపు మంట. సంఘం ఎదగకుండా ఉండాలని దొరలు, భూస్వాములు కోరుకున్నరు. జనగాం ఏరియాలో ఆంధ్ర మహాసభ సంఘం మొదటిది. ఈ మాట భీమిరెడ్డి నరసింహారెడ్డి ఐలమ్మతో అన్నడు. ఆయన కూడా దొరే. ప్రజల కోసం పని చేసిండు. ఎంపీగా కూడా గెలిచిండు.

కుటుంబమంతా జైల్లోనే..

భూమి విషయంలో దొర తప్పుడు కేసులు పెట్టించిండు. పార్టీ బహిరంగ సభపై తన గుండాలచే దాడి చేసి కేసులు కూడా పెట్టించిండు. ఐలమ్మ భర్త నరసయ్య, ఇద్దరు కొడుకులు సోమయ్య, లచ్చయ్యలు నాయకులతోపాటు జైలు జీవితం గడిపిండ్రు. ఐలమ్మ బిడ్డ సోమ నరసమ్మ జీవితాన్ని దొర గుండాలు ఆగం చేసిండ్రు. ఆమె చనిపోయే వరకు నరకం అనుభవించింది. సాయుధ పోరాటం కంటే ముందు ఈ పోరాటం జరిగింది. అందుకే పెద్ద గుర్తింపొచ్చింది. ఐలమ్మ మహిళ కావడం.. దొరలను ఎదిరించడం మామూలు విషయం కాదు. అందుకే ఎక్కడ పోయినా అమ్మను యాది చేస్తుండ్రు. ఐలమ్మ పోరాటాన్ని, త్యాగాన్ని ప్రభు త్వాలు గుర్తించకపోయినా.. ప్రజల గుర్తింపు ఉంది. మాకు అది చాలు, ఐలమ్మ మనవలుగా మమ్మల్ని ఆదరిస్తున్నరు. గౌరవిస్తున్నరు. ఇంత కంటే మా జీవితాలకి ఇంకేం కావాలి అన్నడు.

ఎర్రజెండా నిలబడాలె..!

ఆయనతో మాట్లాడినంతసేపు ముఖంలో సంతోషం తొణికిసలాడింది. ఉద్యమ స్ఫూర్తి ఆయన మాటల్లో కనిపించింది. పాలకుర్తి ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడిన విషయంపై ఆందోళన వ్యక్తం చేశాడు. మీలాంటి యువతరం బాగా పనిచేయాలని కోరుకున్నారు. ఉద్యమాల పురిటి గడ్డపై ఎర్రజెండా నిలబడాలని ఆకాంక్షించారు. ఏదో ఒక సందర్భంలో కనిపించినప్పుడు మామ, అల్లుడు అంటూ ఆప్యాయంగా పలకరించిన లక్ష్మీ నరసయ్య మన నుండి 2021 మార్చి 02న భౌతికంగా దూరమయ్యాడు.

## హూవర్ డ్యామ్ జల విద్యుత్ స్ఫూర్తితో రాష్ట్రంలో మెరుగైన పద్ధతులు, రక్షణ చర్యలు



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు వ్యాఖ్ అమెరికాలోని నేవడ, అరిజోన రాష్ట్రాల సరిహద్దులో కొలరాడో నదిపై ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు హూవర్ డ్యామ్ ఎంతో ఆదర్శవంతమైందని, ఇక్కడి నీటి వినియోగం, అమలవుతున్న రక్షణ చర్యలు ఆచరించదగినవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. అమెరికాలో అధికారిక పర్యటనలో ఉన్న ఆయన బుధవారం నాడు రాష్ట్ర ప్రతినిధి బృందంలో గల ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రెటరీ శ్రీ కృష్ణ భాస్కర్ ఇంకా ఇతర అధికారులతో కలిసి హూవర్ డ్యామ్ ను సందర్శించారు. ఫెడరల్ గవర్నమెంట్ అధికారులు వారికి ప్రాజెక్టు వివరాలను స్వయంగా వివరించారు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడిన కాలంలో 1931-36 మధ్య నిర్మించిన ఈ ఆర్క్ గ్రావిటీ నిర్మాణం ఒక ఇంజనీరింగ్ అద్భుతమని, ఇక్కడ గల 17 జనరేటర్ల ద్వారా 2080 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, తద్వారా మూడు రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీరుస్తుందని అధికారులు వివరించారు. ఈ ప్రాంతంలోని మూడు ప్రధాన పట్టణాల్లో ఉన్న 80 లక్షల మంది ప్రజల మంచినీటి అవసరాలతో పాటు సాగునీటి అవసరాలు కూడా హూవర్ డ్యామ్ తీరుస్తుందని వారు వివరించారు. 726 అడుగుల ఎత్తు, 1244 అడుగుల పొడవు ఉన్న ఈ డ్యామ్ వెనుక ఒక పెద్ద కృత్రిమ సరస్సు ఏర్పడిందని, పూర్తి నీటి నిలువ సామర్థ్యం ఉన్నప్పుడు 185 కిలోమీటర్ల పొడవున నీటితో విస్తరించి ఉంటుందని వివరించారు. ఏటా సుమారు 80 లక్షల మంది పర్యాటకులు దీన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అక్కడ జరుగుతున్న జల విద్యుత్తు ఉత్పాదకత, యంత్రాల సామర్థ్యం, నీటి లభ్యత, అడుగడుగునా ఏర్పాటు చేసిన రక్షణ చర్యలు, ఇంకా ఇతర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో గల జల విద్యుత్తు ప్రాజెక్టుల సమాచారంతో బేరీజు వేస్తూ హూవర్ డ్యామ్ జలవిద్యుత్తు ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకొని మన ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదలకు, రక్షణ మెరుగుదలకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర అధికారులను కోరారు. ఈ సందర్భంగా 1931 నుండి 35 మధ్య జరిగిన డ్యామ్ నిర్మాణ దృశ్యాలను, ఫోటోలను డ్యామ్ అధికారులు ప్రదర్శించారు.

### వర్చువల్ రియాలిటీ సాయంతో బొగ్గు ఉత్పత్తి ఒక అద్భుతం : శ్రీ భట్టి విక్రమార్క మల్లు

మైనెక్స్-2024 అంతర్జాతీయ ప్రదర్శనలో బుధవారం నాడు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి శ్రీభట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర ప్రతినిధి బృందంతో కలిసి వివిధ ప్రఖ్యాత కంపెనీల స్టాల్స్ ను సందర్శించారు. శాండ్విక్ కంపెనీ స్టాల్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంటిన్యూయస్ మైనర్ యంత్రాన్ని పరిశీలించారు. అనంతరం అదే స్టాల్లో ఏర్పాటు చేసిన వర్చువల్ రియాలిటీ మైనింగ్ టెక్నాలజీని స్వయంగా పరిశీలించారు. ఈ వర్చువల్ రియాలిటీ ద్వారా గని లోపల పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నందు వల్ల యంత్రాలను నడిపే ఆపరేటర్లు దీనితో మెరుగైన శిక్షణ పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఈ వర్చువల్ రియాలిటీతో గని యొక్క పని ప్రదేశానికి యంత్రాన్ని పంపించి అక్కడి పరిస్థితులను వెలుపల నుండే అంచనా వేస్తూ బొగ్గును త్రవ్వొచ్చని, ఇది అత్యాధునిక మైనింగ్ పద్ధతిగా నిలుస్తుందని నిర్వాహకులు చెప్పారు. శ్రీ భట్టి విక్రమార్క మల్లు స్వయంగా వర్చువల్ రియాలిటీ సాంకేతికతను హెడ్ గేర్ ధరించి పరిశీలించారు. ఈ సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలు అద్భుతం అని, ఈ ఆధునిక సాంకేతికత వల్ల కార్మికులకు చిన్న ప్రమాదం జరగకుండా ఉత్పత్తిలో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల రక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ తరహా సాంకేతికతను ప్రస్తుత గనుల్లో మరియు భవిష్యత్తు గనుల్లో ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని బృందంలో ఉన్న సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ ను కోరారు. ఈ ప్రదర్శనలో ఇంకా రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## “తగ్గేదే లేదు, పూర్తిశక్తితో హిజ్బుల్లాపై దాడి చేయండి”..

### ఆర్మీకి ఇజ్రాయిల్ ప్రధాని ఆదేశాలు..



ఇజ్రాయిల్ లెబనాన్‌పై విరుచుకుపడుతోంది. హిజ్బుల్లా మిలింటెట్లు , వారి స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తోంది. గత వారం నుంచి వైమానిక దాడులతో హిజ్బుల్లాపై విరుచుకుపడుతోంది. ఇప్పటికే దక్షిణ లెబనాన్‌లోని 2000కు పైగా హిజ్బుల్లా లక్ష్యాలపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ పేర్కొంది. ఇదిలా ఉంటే, ఇరు దేశాలు 21 రోజులు పాటు కాల్పుల విరమణ పాటించాలని అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ దేశాలు పిలుపునిచ్చాయి. అయితే, ఈ పిలుపుపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పందించలేదు. మిత్ర దేశాల ఒత్తిడికి తమ ప్రభుత్వం స్పందించలేదని ఇయన చెప్పారు. “ఇది అమెరికా-ఫ్రాన్స్ ప్రతిపాదన, దీనికి ప్రధాని నెతన్యాహూ స్పందించలేదు” అని నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది. ఇదిలా ఉంటే, హిజ్బుల్లాపై విరుచుకుపడేందుకు ఇజ్రాయిల్ సైన్యానికి నెతన్యాహూ పిలిపునిచ్చాడు. పూర్తి శకత్తితో దాడి చేయాలని సైన్యాన్ని గురువారం ఆదేశించాడు. లెబనాన్ పరిస్థితిపై అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ ఆందోళన వ్యక్తి చేశారు. దౌత్యపరంగా సమస్యని పరిష్కరించుకోవడానికి లెబనాన్-ఇజ్రాయిల్ సరిహద్దుల్లో తక్షణమే 21 రోజులు కాల్పుల విరమణ పాటించాలని మిత్రదేశాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు న్యూయార్క్ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా జపాన్, గల్ఫ్ దేశాలు, అమెరికా కాల్పుల ఒప్పందంపై సంయుక్త ప్రకటన చేశాయి. ఇదిలా ఉంటే, లెబనాన్‌పై భూతల దాడులతో పూర్తిగా యుద్ధంలోకి దిగేందుకు ఇజ్రాయిల్ సైన్యం సిద్ధమవుతోంది. ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హాలేవి బుధవారం సైనికులకు హిజ్బుల్లాకు వ్యతిరేకంగా సాధ్యమైన భూదాడికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దీని తర్వాతే కాల్పుల విమరణ పాటించాలని పలు దేశాలు కోరాయి. ఇదిలా ఉంటే హిజ్బుల్లా బుధవారం టెల్ అవీల్‌లోని ఇజ్రాయిల్ గూఢచార సంస్థ మెస్సాద్ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని రాకెట్ దాడులు చేసింది.

## మన అందరికీ చాకలి ఐలమ్మ స్ఫూర్తి ..




**హైదరాబాద్, :** రవీంద్ర భారతిలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ 129వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. వీరితో పాటు రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, బస్వరాజు సారయ్య, బీసీ కమిషన్ చైర్మన్ జీ.నిరంజన్, బీసీ కమిషన్ కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ కమీషనర్ బాల మాయాదేవి, చాకలి ఐలమ్మ మనవరాలు శ్వేత ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మక కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టారు.. అది జీవో రూపంలో కేబినెట్ ఆమోదించిందన్నారు. యూనివర్సిటీ పేరుకు పెడితే తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఎందుకు ధర్నా చేస్తున్నారు.. యూనివర్సిటీకి పేరు పెట్టినందుకా? వారి మనవరాలు శ్వేతమ్మకు మహిళా కమిషన్ సభ్యురాలు ఇచ్చినందుకా? అని ఆయన ప్రశ్నించారు. జాతి ఐక్యత ప్రభుత్వానికి తెలియాలి అంటే రవీంద్ర భారతి దద్దరిల్లాలన్నారు. రాబోయే సంవత్సరం కార్యక్రమం తీసుకోవాలని, 10 సంవత్సరాలుగా బీసీల కోసం ఎందుకు పోలేదు ఈరోజు చెన్నైకి ఎందుకు పోయారు.. ఫంక్షన్ లకి పోయారా అని ఆయన అన్నారు. అంతేకాకుండా..'పార్లమెంట్ లో కుల గణన తీర్మానం చేసి పెడతం. తెలంగాణలో కుల గణన కోసం తీర్మానం చేసి నిధులు మంజూరు చేసుకున్నాం. బీసీ కమిషన్ ఏర్పాటు చేసుకున్నాం. చెన్నై పోతున్న %ఎతీం% నేతలు 10 సంవత్సరాలు ఏం చేశారు.. రాష్ట్రంలో బలహీన వర్గాలకు సంబంధించి అన్ని కార్యక్రమాలు చేపడతాం.. బలహీన వర్గాలకు సంబంధించి మనం తిన్న తినకపోయినా మన పిల్లలను చదివించాలి. మన కుల వృత్తులు మోడరేషన్ అయినాయి.. పిల్లలు మంచిగా చదివితేనే మన జాతికి భవిష్యత్.. చదువు విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేయద్దు.. ఆనాడు భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం పోరాటం జరిగితే అణచివేయబడ్డారు.. మొన్నటి చరిత్రలో నీళ్ళు నిధులు నియామకాలు కోసం అనేక పోరాటాలు జరిగాయి. ఆనాడు నిజాం నిరంకుశ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేయడంలో చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి దాయకం.. సర్దార్ సర్వాయి పాపన్న,కొండ లక్ష్మణ్ బాపూజీ ,కొమురం భీమ్ ఇలా అందరూ మన వర్గాల కోసం మన హక్కుల కోసం పోరాడిన వాళ్ళే.. మన అందరికీ చాకలి ఐలమ్మ స్ఫూర్తి .. జయంతి లోపు ఐక్యంగా మనం కలిసి పోరాడదాం. వేదిక ద్వారా తెలంగాణ రాష్ట్రంలో నా బడుగు బలహీన వర్గాల సంఘాలకు ఉద్యమకారులకు కోరుతున్న కుల గణన తీర్మానం , నిధుల కేటాయింపు ,బీసీ కమిషన్ ఏర్పాటు ,కమిటీ ఏర్పాటు అన్ని జరిగాయి. కుల గణన జరిగి తీరుతుంది. ఎక్కడ కూడా బీసీ లకు అన్యాయం చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం కి లేదు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో బలహీన వర్గాల ఫెడరేషన్ లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే విధంగా కార్యాచరణ తీసుకుంటాం.. భవిష్యత్ లో రాజకీయ, ఆర్థిక ,సామాజిక ఐక్యత తో ముందుకు రావాలి..' అని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

## జనసైనికుల ముట్టడి - పేర్ని నాని మాస్ వార్నింగ్..!!




**అమరావతి,:** మాజీ మంత్రి పేర్ని నాని ఇంటిని జనసైనికులు ముట్టడించారు. తిరుమల లడ్డూ వివాదంలో పవన్ చేసిన వ్యాఖ్యల పైన పేర్ని నాని తాజాగా స్పందించారు. భీమవరంలో బాప్టిజం తీసుకున్నారని చెప్పిన పవన్ ఆయనేనా అంటూ నాని ప్రశ్నించారు. పొరపాట్లు చేసిన వాళ్లే ప్రాయశ్చిత్తం చేసుకుంటారని వ్యాఖ్యా నించారు. దీనికి నిరసనగా జనసైనికులు నాని ఇంటిని ముట్టడించారు. దీంతో, నాని హెచ్చరిక చేసారు. జనసైనికులు పేర్ని నాని ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. తాజాగా పవన్ ను ఉద్దేశించి పేర్ని నాని చేసిన వ్యాఖ్యల పట్ల వారు నిరసన చేపట్టారు. మచిలీపట్నంలోని పేర్ని నాని ఇంటి వద్ద ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ...దిష్టిబొమ్మ దగ్ధానికి ప్రయత్నించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని వారించారు. ఉద్రిక్తత ఏర్పడటంతో అక్కడ నుంచి వారిని పంపేసారు. అయితే, పవన్ పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని జనసైనికులు నినదించారు. తన ఇంటి ముట్టడికి జనసైనికులు రావటం పైన పేర్ని నాని సీరియస్ అయ్యారు. తమ ఇంటికి వాళ్ల ఇల్లు ఎంత దూరమూ..వాళ్ల ఇంటికి తమ ఇల్లు అంతే దూరమని గుర్తించాలని సూచించారు. సినిమా షూటింగ్స్ తరహాలో రాజకీయాల్లో చేయాలంటే సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. కులం, మతం లేదని పార్టీ స్థాపించిన పవన్ ఇప్పుడు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్ని నాని మండిపడ్డారు. ఇతర మతాలను ప్రస్తావిస్తూ హిందువుల బయటకు రారా అంటూ రెచ్చలా మాట్లాడుతూ నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆగొట్టేరోపించారు.


స్పష్టం చేసారు. ఇలాంటి బెదిరింపులకు వైసీపీ కేడర్

ఇదే విధంగా రాజకీయం చేస్తే తాము సిద్ధమని పేర్ని నాని , తాము భయపడేది లేదన్నారు. పోలీసులు ఇలాంటివి చూస్తూ కూర్చొంటే మచిలీపట్నంలో శాంతి భద్రతలు అదుపు తప్పుతాయని పేర్ని నాని హెచ్చరించారు.

## అమెరికాను వణికిస్తున్న హరికేన్ హెలెన్

వాషింగ్టన్ : అమెరికాను హరికేన్ హెలెనా ఉష్ణమండల తుఫాను వణికిస్తోంది. మెక్సికో తీరం నుంచి అమెరికాలోని ఫ్లోరిడా దిశగా హరికేన్ హెలెన్ దూసుకెళ్తోందని యుఎస్ నేషనల్ హరికేన్ సెంటర్(ఎన్‌హెచ్‌సీ) వెల్లడించింది. హెరికేన్ బుధవారం ఉదయానికి ఫ్లోరిడాలోని టంపాకు నైరుతి దిశలో 500 మైళ్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ ప్రభావంతో 80 కిలోమీటర్ల మేర వేగంతో గాలులు వీస్తున్నాయి. గురువారం సాయంత్రానికి హెరికేన్ కేటగిరి - 3 లేదా కేటగిరి - 4గా బలపడే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌సి అధికారులు తెలిపారు. కాగా, హరికేన్ హెలెన్ ఫ్లోరిడా సిటీపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్న నివాసితులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ తుఫాను ఫ్లోరిడాలోకి దాదాపు పది కౌంటీలపై ప్రభావం చూపనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ తుఫాను వల్ల పలు ప్రాంతాల్లో వరద నీటిలో కార్లు మునిగిపోయాయి. పెనుగాలులు, కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందని అమెరికా వాతారణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

# డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకే భారీ నష్టం!




ప్రగతిశీల విధానాలతో ముందుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలు రాబోయే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) వలన తక్కువ లోక్‌సభ స్థానాలు పొందనుండటం, జనాభా నియంత్రణ చేయని ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్ల పెంపులో లబ్ధి పొందనుండటం దురదృష్టకరం. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి కారణమైన దక్షిణాది రాష్ట్రాలు ఈ డీలిమిటేషన్ విధానం వలన భవిష్యత్తులో ప్రాధాన్యత కోల్పోతాయి. ఫలితంగా స్వంతంత్ర వేర్పాటువాద ధోరణులు హెచ్చరిల్లే అవకాశాలున్నాయి. అలా రాకుండా చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. దశాబ్దాల కాలంలో జనాభా పెరుగుదల తేడాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఈ విషయంలో బీజేపీ హుందాగా వ్యవహరిస్తుందా? లేక వివక్ష చూపిస్తుందా? ఏ రాష్ట్రానికి ఎన్ని ఎంపీ సీట్లు ఉండాలనేది ఆయా రాష్ట్రాల జనాభా ఆధారంగా నిర్ధారణ అవుతుంది. ప్రస్తుతం ఉన్న సీట్లు 1971 జనాభా లెక్కల ప్రకారం విభజించినవి. అయితే, 1971 తరువాత దక్షిణ భారత రాష్ట్రాలు జనాభాను బాగా తగ్గిస్తూ వచ్చాయి. అదే సమయంలో ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాలు జనా భాను పెంచుతూ పోయాయి. దీంతో జనాభా ను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్ల సంఖ్య తగ్గుతుంది. జనాభాను పెంచిన ఉత్తర రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్లు పెరుగుతాయి. అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నీ తీవ్రంగా నష్టపోతాయి. ఇప్పటికీ ఉత్తర భారత ఆధిపత్యంపై అనేక విమర్శలున్నాయి. ఆఖరికి ఎంపీ స్థానాల్లో కూడా దక్షిణాది బలం తగ్గిపోతే, ఇక దక్షిణ భారత్ నామమాత్రం అయిపోతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఒక ఓటు - ఒక విలువ...

నియోజకవర్గం సరిహద్దులు నిర్ణయించి, ఏ నియోజకవర్గంలో ఎంత మంది జనాభా ఉండా లి, ఏ ఏ గ్రామాలు, మండలాలు ఆ నియోజకవర్గంలో ఉండాలో నిర్ణయించే ప్రక్రియను పునర్విభజన లేదా డీలిమిటేషన్ అంటారు. రాజ్యాంగంలోని 82, 170 ప్రకరణల ప్రకారం జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన జరుగుతుంది. 1952, 1962, 1972, 2002లలో పునర్విభజనలు జరిగాయి. పునర్విభజన జరిగినప్పుడే సీట్ల సంఖ్య పెంచడం, తగ్గించడం కూడా చేస్తారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాలను విభజిస్తే దక్షిణ భారతానికి తీవ్ర నష్టం జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. భారతదేశ పౌరులందరి ఓటుకూ ఒకే విలువ ఉండాలని రాజ్యాంగం కోరుకుంటుంది. కానీ ప్రస్తుతం యూపీలో 30 లక్షల జనాభాకు ఒక ఎంపీ ఉంటే, తమిళనాడులో 18 లక్షల జనాభాకు ఒక ఎంపీ ఉన్నారు. అంటే ఇప్పుడు తమిళ ఓటర్ విలువ ఎక్కువ, యూపీ ఓటర్ విలువ తక్కువ అవుతుంది కదా. అలా జరగకుండా ఉండటం కోసం జనాభా ఆధారంగా ఎప్పటికప్పుడు నియోజకవర్గాలు పునర్విభజన చేస్తారు. ఒక నియోజవకర్గంలో లక్ష మంది కలసి ఒక ఎంపీని ఎన్నుకుని, మరో నియోజకవర్గంలో పాతిక లక్షల మంది ఒకే ఎంపీని ఎన్నుకోవడం కాకుండా, ప్రతీ ఓటుకీ సమాన విలువ ఉండాలన్న సిద్ధాంతం ప్రకారం ఈ ప్రక్రియ జరిగినప్పుడే అది ప్రజాస్వామ్య పునాదులకు బలాన్ని చేకూరుస్తుంది.

దక్షిణాదికి భారీ నష్టమా?

1970ల మధ్య నుంచి 1980ల వరకూ భారతదేశం జనాభా నియంత్రణకు చాలా ప్రాధాన్యత ఇచ్చింది. ఆరుగురు, పదిమంది పిల్లలను కనవద్దు ...ఒకరిద్దరు పిల్లల్ని కంటే చాలు అంటూ ప్రభుత్వాలు విరివిగా ప్రచారం చేశాయి. ఆ దిశగా దక్షిణ భారత్‌లో మార్పు వచ్చింది. తక్కువ మంది పిల్లల్ని కన్నారు. ఫలితంగా జనాభా బాగా తగ్గింది. కానీ ఉత్తర భారతంలో చాలా రాష్ట్రాల్లో జనాభా నియంత్రణపై ప్రచారం సరిగా లేనందున జనాభా అలాగే ఉండిపోయింది. తీరా చూస్తే హిందీ రాష్ట్రాల్లో ఇప్పుడు విపరీతమైన జనాభా ఉంది. జనాభా ఎక్కువ ఉంటే ఎక్కువ సమస్యలు, తక్కువ ఉంటే ఎక్కువ లాభాలు అనే ధీమా ఉంది, కుటుంబ నియంత్రణ కారణంగా దక్షిణ భారతం హిందీ రాష్ట్రాల కంటే చాలా విషయాల్లో ముందుండడానికి దోహదపడింది. ఇప్పుడిదే శాపంగా మారబోతోందా? అనే భయం దక్షిణాది ప్రజల్లో బలంగా ఉంది.

అంతరాలు తగ్గిపోతాయనుకున్నప్పటికీ..

1976 వరకూ, డీలిమిటేషన్ జరిగితే రాష్ట్రాల వారీగా ఎంపీల సంఖ్య మారుతుండేది. అప్పటి వరకూ అన్నిచోట్లా జనాభా పెరుగుదల ఒకేలా ఉండేది కాబట్టి రాష్ట్రాల మధ్య ఒకట్రెండు సీట్లు పెరిగినా, తగ్గినా పెద్ద తేడాలు రాలేదు. సమస్య కాలేదు. కానీ, ఆ తరువాత జనాభా కట్టడి విషయంలో రాష్ట్రాల మధ్య మార్పులు వచ్చాయి అలాగే, 1976లో ఒక రాజ్యాంగ సవరణ ప్రకారం, నియోజకవర్గ సరిహద్దులు ఎలా అయినా మార్చవచ్చు కానీ, ఒక రాష్ట్రానికి ఉన్న ఎంపీల సంఖ్యను మార్చకూడదనేది ఆ సవరణ సారాంశం. అంటే జనాభా పెరుగుదల తగ్గుదలతో సంబంధం లేకుండా ఆయా రాష్ట్రాలకు ఎంపీల సంఖ్య నికరంగా ఉంటుంది. అప్పట్లో దానికి పాతికేళ్ల డెడ్ లైన్ పెట్టారు. అంటే 1976 నుంచి 2001 వరకూ మొదటి డెడ్‌లైన్ పూర్తయింది. 2001 నాటికి భారతదేశంలోని రాష్ట్రాల మధ్య జనాభా అంతరాలు తగ్గిపోతాయనుకున్నారు. కానీ అలా జరగలేదు. దీంతో 2001లో మరోసారి ఈ ఫ్రీజింగ్ గడువు మరో 25 ఏళ్లకు పెంచారు. అంటే 2026 అన్నమాట. ఇప్పటి డీలిమిటేషన్‌కు ఒక ప్రత్యేకత ఉంది. ఆ డెడ్ లైన్ ఇప్పుడు పూర్తయిపోతుంది. ఈ డీలిమిటేషన్లో ఆయా రాష్ట్రాలకు వచ్చే ఎంపీల సంఖ్య మార్చే అవకాశం చట్ట ప్రకారం కుదురుతుంది. చట్ట ప్రకారం 2026 తరువాత జనాభా లెక్కలు ఎప్పుడు జరిగితే అప్పుడు, వాటి ఆధారంగా నియోజవకర్గాల పునర్విభజన జరగాలన్నది మరో నిబంధన. ఇదే దక్షిణాది పార్టీల భయానికి కారణం.

అంతుచిక్కని బీజేపీ...

బీజేపీ తమ ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం, దక్షిణాదిన సీట్లు తగ్గించి, హిందీ ప్రాంతంలో సీట్లు పెంచాలని చూస్తోంది. అందుకోసం 2039 వరకూ ఆగకుండా అంతకుముందే డీలిమిటేషన్ చేయాలన్నది వారి ప్లాన్. అందుకోసం 2021 జనాభా లెక్కలను కోవిడ్ తగ్గి పోయినప్పటికీ, కావాలని ఆలస్యం చేసి 2026 తరువాత జరిగేలా చూసి, అప్పుడు వాటి ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయబోతోంది. ఇది కొందరు సోషల్ మీడియా వేదికగా చెప్పిన సొంత విశ్లేషణ. ఈ వార్తలే దక్షిణ భారత పార్టీలను కంగారు పెట్టాయి. అధిక జనాభాతో సతమతమవుతున్న దేశాన్ని కాపాడుకునేందుకు, జనాభా నియంత్రణ చేసిన దక్షిణాది రాష్ట్రాలు ఇప్పుడు అన్యాయం అవుతున్నాయి. కేవలం 18 శాతం జనాభా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు 35% జాతీయ స్థూల జాతీయోత్పత్తికి నిధులు అందిస్తున్నాయి. జాతీయ ఆర్థిక అభివృద్ధికి, దేశ అభివృద్ధికి కారణమైన దక్షిణాది రాష్ట్రాలు ఈ డిలిమిటేషన్ విధానం వలన భవిష్యత్తులో ప్రాధాన్యత కోల్పోతాయనే బాధ ఎక్కువగా ఉంది.

పరిష్కారం ఏంటి?

రాష్ట్రాల జనాభా ఆధారంగా సీట్లు పెంచ కుండా, ప్రతీ రాష్ట్రానికీ నియమిత శాతం ప్రకా రం సీట్లు పెంచేలా చర్యలు ఉండాలని ఎక్కువ మంది చెబుతున్నారు. ఉదాహరణకు లోక్ సభలో 30 శాతం సీట్లు పెంచితే, అప్పుడు ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాలకు మరో 24 చేర తాయి. అలానే ఆంధ్రాలో 25కి 7 సీట్లు చేర తాయి. అలాంటి పద్ధతి వల్ల ఇబ్బంది ఉండదు. దశాబ్దాల కాలంలో జనాభా పెరుగుదల తేడాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. బీజేపీ హుందాగా వ్యవహరిస్తుందా? లేక వివక్ష చూపిస్తుందా? అని జనాభా లెక్కల తరువాతే తేలుతుంది. కొందరు విశ్లేషకులు అసలు లోక్‌సభ సీట్లు పెంచాల్సిన అవసరం లేదనే వాదిస్తున్నారు. అయితే పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా ప్రజలకు పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉండడ మే నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి కాబట్టి సీట్ల సంఖ్య పెంచాలని ప్రతిపాదిస్తున్నా రు ఇంకొం దరు. ఏమైనా ఈ పంచాయతీ మళ్లీ జనాభా లెక్కలు పూర్తయిన తరువాతే తేలుతుంది.

# జమిలి ఎన్నికలతో రాష్ట్రాల ఎజెండాకు ప్రమాదం!



భారతదేశం చాలా వైవిధ్యం గల దేశం. ప్రాంతీయ ప్రత్యేకతలు, విభిన్న భాషలు, భిన్న మతాలు గల దేశం. సామాజికంగా ఆహారం దగ్గర నుండి ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాల పరంగా ప్రపంచంలోనే భారతదేశానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఈ బహుళత్వాన్ని, వైవిధ్యాన్ని మన రాజ్యాంగ నిర్మాతలు పరిగణనలోకి తీసుకుని దీనికి తగిన పార్లమెంటరీ తరహా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని ఎంపిక చేశారు. కేంద్ర రాష్ట్రాల మధ్య సహకార సమాఖ్య విధానాన్ని పెంపొందించడానికి రాజ్యాంగంలోని 1వ ఆర్టికల్ ఇండియాను రాష్ట్రాల కలయికగా పేర్కొన్నది. అనాడు రాజ్యాంగ నిర్మాతలు కేంద్రానికీ, రాష్ట్రాలకీ మధ్య రాజ్యాంగ బద్దంగా స్పష్టమైన విభజన రేఖలు గీశారు. కేంద్ర జాబితా, రాష్ట్రాల జాబితా, ఉమ్మడి జాబితాల రూపంలో అధికారాల విభజన చేశారు. ఎన్నికలలో ప్రజలు తీర్పు చెప్పడానికి ఇవి ప్రాతిపదికలు అవుతున్నాయి. అందుకే జాతీయ స్థాయిలో లోక్‌సభకు జరిగే ఎన్నికలలో వివిధ పార్టీలు జాతీయ ఎజెండాను రూపొందించుకొని ఎన్నికల ప్రచార సరళిలో పాల్గొంటారు.

వేర్వేరుగా తీర్పునివ్వడం కష్టతరమైన పనే!

కేంద్ర జాబితాలోని దేశ రక్షణ, పౌరసత్వం, కరెన్సీ, బ్యాంకింగ్, రైల్వేలు, విమానయానం, నౌకాయానం, విదేశాంగ విధానం, ఆధారపు పన్ను, న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలపై ఆయా పార్టీలు ప్రకటించే విధివిధానాల ఆధారంగా ప్రజలు ఎన్నికల్లో తీర్పు చెప్పాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలోనైతే ప్రధానంగా ప్రాంతీయ పార్టీల హవా ఎక్కువగా కొనసాగుతుంటుంది. రాష్ట్రాల్లో పోటీ చేసే ఆయా పార్టీలు రాష్ట్రీయ ఎజెండాను ప్రజల ముందు ఉంచి ఎన్నికల్లో పాల్గొంటారు. రాష్ట్ర జాబితాలోని శాంతి భద్రతలు, సంక్షేమ పథకాలు, విద్యా, వైద్యం, వ్యవసాయం, స్థానిక సుపరిపాలన వంటి అంశాల ఆధారంగా రాష్ట్రాలలో ప్రజలు ఎన్నికల తీర్పు చెబుతారు. కానీ ఈ రెండింటికి ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రజలు జాతీయ, ప్రాంతీయ ఎజెండాలపై వేర్వేరుగా తన అభిప్రాయాలను వెలిబుచ్చడం కష్టతరమైన పనే.


వేరువేరుగా జరపడం వలన..

ప్రజలు జాతీయ జెండాకు, ప్రాంతీయ జెండాకు వేరువేరుగా ప్రాధాన్యత ఇస్తారు. ఇందుకు నాటి నుంచి నేటి వరకు జరిగిన భారత ఎన్నికల చరిత్రే నిదర్శనం. ఇందు కు ఇటీవల తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలే నిదర్శనం. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 14% ఓటు బ్యాంకు లభిస్తే, 2024 జూన్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకీ 35% ఓట్లు లభించాయి. ఇక్కడి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 21% అదనంగా ఓట్లు లభించాయి. అలాగే బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో 37% ఓట్లతో 39 సీట్లు సాధిస్తే, పార్లమెంటు ఎన్నికల్లోకి వచ్చేసరికి 17% ఓట్లతో ఒక్క సీటూ కూడా గెలుపొందలేకపోయింది. ఇక్కడ ఓట్ల శాతం సీట్ల శాతాన్ని పరిశీలిస్తే జాతీయ ఎజెండాకు, ప్రాంతీయ ఎజెండాకు మధ్య ప్రజలు స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపారు. ఇదే విధమైన వ్యత్యాసాన్ని అటు ఢిల్లీ ఎన్నికలలోను, అనేక రాష్ట్రా ల్లోనూ ప్రజలు చూపించారు. కానీ దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల జాతీయ పార్టీలకు మేలు జరిగి ప్రాంతీయ పార్టీలకు తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అందుకే లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు వేరువేరుగా ఎన్నికలు జరపడం వల్ల ప్రజలు దేనికి తగ్గ తీర్పు దానికి చెప్పడానికి వీలు కలుగుతుంది.

ఈ తతంగమంతా చూస్తే..

జమిలి ఎన్నికల వల్ల ఈ అధికార విభజన సిద్ధాంతం దెబ్బతిని సమైక్య స్ఫూర్తికి విఘాతం కలిగే ప్రమాదం లేకపోలేదు. జమిలీ విధానం ద్వారా జాతీయ అంశాలే తెరమీదికి వచ్చి ప్రాంతీయతకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుంది. కేంద్రం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్వర్యంలో జమిలీ ఎన్నికలపై ఒక కమిటీ వేయడం ఆ కమిటీ ఈ దేశ ప్రజలందరి మనోభావాలను 190 రోజులలోనే అధ్యయనం చేయడం, 47 రాజకీయ పార్టీల అభిప్రాయాలను సేకరించడం, 21,500 ప్రజల అభిప్రాయాలను తీసుకొని 18,626 పేజీల నివేదిక తయారు చేయడం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించడం, వెను వెంటనే కేంద్ర క్యాబినెట్ ఆమోదించడం, పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో బిల్లు పెట్టడానికి సిద్ధం కావడం ఈ తతంగమంతా చూస్తుంటే బీజేపీకి ఎంత అధికార దాహం ఉందో స్పష్టమవుతుంది. జమిలీ ఎన్నికల విధానం 1970లో కాలగర్భంలో కలిసిన చరిత్రను చూసినంక కూడా బీజేపీ ఎందుకు ఇంత దుందుడుకుగా వ్యవహరిస్తుందో ప్రజాస్వామికవాదులు ఆలోచించి ప్రజలను చైతన్యవంతులు చేయాల్సిన సందర్భం ఇది.

# బాలలకు సుప్రీమ్ రక్షణ!



భారత సర్వోన్నత న్యాయస్థానం సోమవారం చరిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. మద్రాస్ హైకోర్ట్ గతంలో చేసిన తప్పును సరిదిద్దింది. బాలలపై లైంగిక అక్కృత్య, అశ్లీల దృశ్యాల వీడియోలను డౌన్ లోడ్ చేసినా, కలిగివున్నా, చివరకు చూసినా, సదరు అంశాలపై నిర్ణీత అధికారులకు ఫిర్యాదు చేయకున్నా కూడా పోక్సో, ఐటీ చట్టాల కింద నేరమేనని కుండబద్దలు కొట్టింది. దాదాపు 200 పేజీల తాజా తీర్పుతో బాలలపై లైంగిక అత్యాచారాలను నిరోధించేలా ‘లైంగిక అకృత్యాల నుంచి బాలలకు రక్షణ’ (పోక్సో) చట్టానికి పదును పెట్టింది. పసిపాపల నుంచి ఎదిగిన మైనర్ల వరకు బాలలందరి పైనా దేశంలో అంతకంతకూ అఘాయిత్యాలు పెరుగుతున్న వేళ రానున్న రోజుల్లో ఈ తీర్పు బలమైన ప్రభావం చూపనుంది. ఇంటా బయటా ప్రతిచోటా కామాంధుల బెడద పెచ్చరిల్లిన సమయంలో ఈ సుప్రీమ్ తీర్పు భారతదేశంలోని బాలబాలికలకు భారీ ఊరట, బలమైన అండ. తాజా సుప్రీమ్ కోర్ట్ ఆదేశంతో చైల్డ్ పోర్నోగ్రఫీ సమాచారాన్ని ‘కలిగి ఉండడం’ అనే పదం తాలూకు నిర్వచన పరిధి పెరిగింది. అలాంటి దృశ్యాలను డౌన్‌లోడ్ చేయకున్నా, పరికరంలో పదిలపరుచుకోకపోయినా... కేవలం చూసినా సరే ఇప్పుడది పోక్సోలోని సెక్షన్ 15 కింద నేరమే అవుతుంది. ఇది కేవలం సాంకేతికపరమైన అంశం కానే కాదు... తీవ్రమైన నేరం. నిజానికి, చైల్డ్ పోర్న్ దృశ్యాల తయారీ, పంపిణీయే నేరమనీ, ఎలక్ట్రానిక్ పరికరాల్లో డౌన్‌లోడ్ చేసి ప్రైవేటుగా చూసినంత మాత్రాన అది నేరం కిందకు రాదనీ ఆ మధ్య మద్రాస్ హైకోర్ట్ తీర్పునిచ్చింది. మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసి చూసిన ఓ చెన్నై కుర్రాడిపై నేర విచారణను జనవరి 11న రద్దు చేసింది. దీని వల్ల బాలల సంక్షేమంపై దుష్ప్రభావం పడుతుందని తప్పుబడుతూ వివిధ స్వచ్ఛంద సంస్థల సమాహారమైన ‘జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్’ సుప్రీమ్ గడప తొక్కింది. సింగిల్ జడ్జి ఇచ్చిన సదరు తీర్పు ‘ఘోరమైనది’ అంటూ మార్చిలోనే సుప్రీమ్ తప్పుబట్టింది. మద్రాస్ హైకోర్ట్ తీర్పు ‘అసాధారణతప్పు’ అని సుప్రీమ్ తన తాజా ఆదేశంలో వ్యాఖ్యానించడం గమనార్హం. సుప్రీమ్ తన తాజా ఆదేశంతో ఆ పాత మద్రాస్ హైకోర్ట్ తీర్పును తోసిపుచ్చినట్టయింది. అదే సమయంలో ‘చైల్డ్ పోర్నోగ్రఫీ’ అనే పదం నేరాన్ని తేలిక చేస్తున్నట్టు ఉందని భావించింది. ఆ పదాన్ని పరిహరించి, దాని బదులు ‘బాలలపై లైంగిక అకృత్యాలు, దాడుల సమాచారం’ (సీఎస్ఈ ఏఎమ్) అనే పదాన్ని సంబంధిత చట్టాలన్నిటిలో వాడేలా పార్లమెంట్ ఆర్డినెన్స్ తీసుకురావాలని అభ్యర్థించడం విశేషం. ఇకపై న్యాయస్థానాలన్నీ తమ ఆదేశాలు, తీర్పుల్లో ఈ పదాన్నే వాడాలని కూడా సుప్రీమ్ పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, మరో న్యాయమూర్తి జస్టిస్ పార్దీవాలాలతో కూడిన సుప్రీమ్ ధర్మాసనం ఇచ్చిన ఆదేశం, చేసిన అభ్యర్థన ఆలోచించదగినది, స్వాగతించవలసినది. గమనిస్తే, సమస్యంతా చట్టాలలోని అంశాలకు కొన్ని కోర్టులు సంకుచిత అంతరార్థాలు తీయడంతో వస్తోంది. మద్రాస్ హైకోర్ట్‌లోనూ జరిగింది అదే. తద్వారా బాలలపై సైబర్ నేరాలకు పాల్పడినవారిని శిక్షించడానికి ఉద్దేశించిన చట్టాల ప్రయోజనమే దెబ్బతింటోంది. అందుకే, ఈ విషయంలో కోర్టులు జాగరూకతతో ఉండాలని సుప్రీమ్ ఇప్పుడు చెప్పాల్సి వచ్చింది. గణాంకాలు గమనిస్తే, దేశంలో బాలలపై అకృత్యాలు అంతకంతకూ అధికమవుతున్నాయి. ఒక్క 2022లోనే వాటి సంఖ్య 8.7 శాతం పెరిగింది. అలాంటి ఘటనలు 1.68 లక్షలకు చేరినట్టు జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్సీఆర్బీ) మాట. పసివారిపై అఘాయిత్యాలు జరిగినప్పటికీ భయం, సమాజంలో పడే కళంకం, అవగాహన లేమితో ఇంకా అనేక కేసులు వెలుగులోకి రావట్లేదు. పైగా, ఇంట్లో అయినవాళ్ళు, బడిలో ఉద్యోగులు సైతం సాగిస్తున్న ఈ అమానుషాలు పిల్లల మనసులపై జీవితాంతం ప్రభావం చూపుతున్నాయి. పెరిగి పెద్దయినా సరే వారిని ఆ చేదు అనుభవాల నుంచి మానసికంగా బయట పడనీయకుండా చేస్తున్నాయి. వీటన్నిటినీ అరికట్టడానికే 2012లోనే పోక్సో లాంటి కఠినచట్టాలు వచ్చాయి. అయినా, బాలలపై అత్యాచారాలు ఆగక పోవడం విషాదం. సదరు కేసులు పెరుగుతున్నందున ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెట్టాలంటూ అయిదేళ్ళ క్రితమే సుప్రీమ్ ఆదేశించింది. అయితే, రెగ్యులర్ కోర్టులకే జడ్జీలు కరవైన పరిస్థితుల్లో ఇక ఈ ఫాస్ట్‌ట్రాక్‌ల కథేమిటో ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. దానికి తోడు చట్టంలోని కఠిన అంశాలకు ఒక్కో హైకోర్ట్ ఒక్కో రకం అర్థం చెబుతూ, వ్యాఖ్యానం చెప్పడం పెను సమస్యయి కూర్చుంది. తాజా తీర్పుతో ఆ పరిస్థితులు కొంతవరకు మారతాయని ఆశించాలి. చట్టాన్ని అతిక్రమిస్తున్న వారికి మేలుకొలుపు. అదే సమయంలో అది అందరికీ స్పష్టమైన సందేశం ఇస్తోంది. అదేమిటంటే - బాలల భద్రత అతి ముఖ్యమైనది! వారి భద్రత కోసమే కోర్టు చట్టానికి మరింత కఠినమైన, కట్టుదిట్టమైన వ్యాఖ్యానం అందించింది. ఇక యూ ట్యూబ్ - గూగుల్ లాంటి వేదికలు, చట్టాన్ని అమలు చేసే వ్యవస్థలు, నిత్యం ఇంటర్నెట్ వాడేవారు అప్రమత్తంగా ఉండక తప్పదు. అలాంటి కంటెంట్‌ను తక్షణం తొలగించడం, పోలీసులకు ఫిర్యాదు చేయడమే మార్గం. అదే సమయంలో విద్యాలయాల్లో లైంగిక విజ్ఞానాన్ని సమగ్రంగా బోధించి, పిల్లల్లో అవగాహన కల్పించాలంటూ ప్రభుత్వానికి సుప్రీమ్ చేసిన సూచన విలువైనది. బిడియపడకుండా తల్లితండ్రులు, గురువులు పిల్ల లకు విషయాలను వివరించడం మేలు. శారీరకంగా, సామా జికంగా, చట్టపరంగా అవగాహన పెరి గితే అకృత్యాల్ని అడ్డుకోవడం సులభమవుతుంది. ఇలాంటి కేసులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్న సంకేతం సుప్రీమ్ తాజా తీర్పు అందించడం అన్ని విధాలా ఆహ్వానించదగ్గ పరిణామం.

## మోదీజీ శక్తిమంతమైన నాయకుడు.. కానీ దేవుడు కాదు



న్యూఢిల్లీ: ఢిల్లీ రెండు రోజుల అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. అతిషీ ముఖ్యమంత్రి అయిన తర్వాత సభ జరగడం ఇదే తొలిసారి. ఇందులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అంతకుముందు సభ ప్రారంభం కాగానే విపక్షాలు దుమారం రేపాయి. అనంతరం స్పీకర్ రాంనివాస్ గోయల్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. నన్ను, మనీష్ సిసోడియాను చూసి ప్రతిపక్ష నేతలు బాధపడతారని అరవింద్ కేజ్రీవాల్ తన ప్రసంగంలో అన్నారు. మోదీజీ శక్తిమంతమైన నాయకుడు. ఆయన దగ్గర అపారమైన డబ్బు ఉంది. కానీ మోదీ దేవుడు కాదు.. మా దగ్గర కూడా కొంత శక్తి ఉందన్నారు. లక్షలాది ప్రజల ప్రార్థనల వల్లే నేను జైలు నుంచి విడుదలయ్యాను అని అన్నారు. కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజుల క్రితం బీజేపీకి చెందిన ఓ పెద్ద నాయకుడిని కలిశాను. నన్ను జైలుకు పంపితే ఏం వచ్చింది అని ఆ నాయకుడిని అడిగాను. ఢిల్లీని స్తంభింపజేశామని అన్నారు. ఢిల్లీ మొత్తం స్తంభించిందా అని అడిగారు. నా జీవితంలో ఇలాంటి సందర్భాలు మూడు జరిగాయని, 2006లో తొలిసారిగా ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ పదవికి రాజీనామా చేశానన్నారు. 2014లో రెండోసారి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి ఇప్పుడు మూడోసారి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. నాకు ఏ పదవిపైనా అత్యాశ లేదు. ఒకవైపు బీజేపీకి చెందిన ఓ నాయకుడు.. 75 ఏళ్లు దాటిన తమ నేతలందరికీ రిటైర్మెంట్ ఇస్తున్నారు కానీ ఆయన మాత్రం ఈ నిబంధనను పాటించడం లేదన్నారు.

## దెబ్బకొడితే కేసీఆర్‌కు దిమ్మ తిరిగింది : ఎంపీ ఈటల



**హైదరాబాద్, :** గత బీఆర్ఎస్ సర్కార్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ సర్కార్ పేదల కళ్లలో మట్టి కొడుతోందని, కేసీఆర్ కూడా ఇలాగే విర్రవీగి ఏమయ్యాడో అందరూ చూశారని ఈటల మండిపడ్డారు. గురువారం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం మల్లంపేట గ్రామంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యమానికి హాజరైన ఆయన కాంగ్రెస్ సర్కారు తీరును తూర్పారబట్టారు. రేవంత్ రెడ్డిని ఎన్నుకున్న పాపానికి హైదరాబాద్‌లోని పేదలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఎంతమంది పేదల కళ్ళలో మట్టి కొడుతుందని, ఎంతమంది జీవితాలను బుగ్గిపాలు చేస్తుందని ప్రశ్నించారు. రేవంత్ సర్కార్ హైడ్రా పేరుతో పేదలపై చేస్తున్న దౌర్జన్యాలకు త్వరలోనే తగిన మూల్యం చెల్లించక తప్పదని, నీయబ్బ జాగీరా? అని అడుగుతున్నామని ఫైర్ అయ్యారు.కేసీఆర్ కూడా ఇలానే విర్రవీగాడని..చివరికి ఏమయ్యాడో ప్రజలు చూశారని, దెబ్బకొడితే దిమ్మ తిరిగిందని అన్నారు. పేదల బతుకుల్లో మట్టి కొడితే వారి ఉసురు తగలకుండా పోదని ఈటెల హెచ్చరించారు.

## కేసీఆర్ విజయాన్ని తమ ఖాతాలో వేసుకున్న కాంగ్రెస్



**హైదరాబాద్, :** మాజీ సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారని, ఎవరు అవునన్నా.. కాదన్నా అదే నిజమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు.గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలన వ్యవసాయ రంగానికి ఒక సువర్ణ అధ్యాయం అని తెలిపారు. 2023-24 ఏడాదికి గాను వరి ఉత్పత్తిలో తెలంగాణ మొదటి స్థానంలో, పత్తి ఉత్పత్తిలో 3వ స్థానంలో నిలిచిందన్నారు. దీనిపై గురువారం ట్వీట్ చేసిన హరీశ్ రావు.. ఈ ఘనత మంత్రం వేస్తేనో.. మాయ చేస్తేనో జరిగిందని కాదని చెప్పారు. ఇదంతా ఒక్క రోజులోనూ జరిగింది కాదని, కేసీఆర్ తొమ్మిదేళ్ల కృషి, పట్టుదల, విజనరీ లీడర్ షిప్ వల్ల సాధ్యపడిందన్నారు. అయితే, కేసీఆర్ కష్టపడి సాధించిన విజయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తన ఖాతాలో వేసుకున్నదని సెటైర్లు వేశారు. పంటల సాగులో మేటి మన తెలంగాణ..దేశానికే ఆదర్శం మన తెలంగాణ అని చెప్పుకొచ్చారు.కానీ, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫైర్ అయ్యారు.

## రైతులకు శుభవార్త.. ఆ రోజున పీఎం కిసాన్ నిధుల విడుదల




న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఉన్న అన్నదాతలకు కేంద్రం శుభవార్త చెప్పింది.ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ విడత నిధుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు అక్టోబర్ 5వ తేదీ నుంచి పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు పేర్కొంది. దీనికి సంబంధించిన వివరాలను పీఎం కిసాన్ సమ్మాన్ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని కోరింది.ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద అర్హులైన రైతులకు ప్రతి 4 నెలలకు రూ. 2,000 చొప్పున, ఏడాదికి రూ. 6,000 ఆర్థిక సాయాన్ని కేంద్రం అందజేస్తున్న విషయం తెలిసిందే. ఏప్రిల్-జూలై, ఆగస్టు- నవంబర్, డిసెంబర్-మార్చి నెలల్లో 3 వాయిదాల్లో పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తున్నది. 16వ విడత ఈ ఏడాది జూన్ 18న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. యూపీలో ఫిబ్రవరిలో విడుదలైంది. 17వ విడత నిధులనుని వారణాసిలో 9.26 కోట్ల మంది రైతులకు 17వ విడతగా రూ. 21,000 కోట్లను ప్రధాని మోడీ అర్హుల ఖాతాల్లో జమచేశారు.

## చాకలి ఐలమ్మ జయంతి.. సీఎం రేవంత్ ఏమన్నారంటే?



**హైదరాబాద్, :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముందుగా ఆమె చిత్రాపటానికి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. గడీల వ్యవస్థపై గళమెత్తి భూ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ.. బహుజనుల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ఆమె ప్రతీక అని కొనియాడారు. కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెడతామని ఇటీవల రవీంద్రభారతిలో జరిగిన ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. అంతేగాకుండా, ఆమె కుటుంబ సభ్యులు ప్రభుత్వంలో భాగస్వాములు కావాలిని ఆశించారు.ఆమె మనువరాలు శ్వేతను మహిళా కమిషన్‌లో సభ్యురాలిగా నియమిస్తామని సీఎం రేవంత్ వెల్లడించారు.మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలుస్తున్న వీరనారి చాకలి ఐలమ్మ పేరును కోఠి మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. చాకలి ఐలమ్మ వారసులకు సముచిత గుర్తింపును కల్పించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ప్రయత్నం మంచిదే!




ఇటీవల కన్నుమూసిన మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి మన దేశాన్ని అందమైన ఒక పూల బొకేతో పోల్చారు. రంగురంగుల పూలన్నీ ఒక చోట చేరి, ఆ బొకేకి అందాన్ని చేకూర్చినట్టు భారతంలో భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న ప్రాంతాలు, రకరకాల భాషలు, పలురకాల సాంప్రదా యాలు వెరసి మరేదేశంలో లేని విధంగా మన దగ్గర భిన్నత్వంలో ఏకత్వమనేది శతాబ్దాలుగా పరిఢవిల్లుతోందని ఆయన నొక్కి వక్కాణిం చారు. అదే కోవలో మహత్తర, వీరోచిత సాయుధ రైతాంగ పోరాటం జరిగిన తెలంగాణ గడ్డ గంగా జమునా తెహజీబ్కు ప్రతీకగా నిలిచింది. భాషలు, మతాలు వేరైనా, మనమంతా భాయి భాయి అంటూ హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు గురజాడ చెప్పినట్టు అన్నదమ్ముల వలె కలగలిసి తిరుగుతున్నారు. అయితే కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈ సోదరతత్వాన్ని విడదీసి, పరమత సహనానికి బీటలు వార్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో ఎనిమిది మంది ఎంపీలను గెలిచిన కమలం పార్టీ ఇక్కడ ఏ మూలన ఏం జరిగినా, దాన్ని తనకు అనుకూలంగా మలుచు కునేందుకు ప్రయత్నిస్తోంది. భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు అది కుయుక్తులు పన్నుతోంది. వ్యక్తిగత విభేదాలకు మతం రంగు పూస్తూ.. మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు అది కుట్రలు పన్నుతోంది. వాటికి సామాన్య ప్రజలు బలవుతుండటం ఆందోళనకరం. దాని ఉచ్చులో కొందరు పావులుగా మారుతున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో జరిగిన ఘటన ఈ కోవలోకే వస్తుంది. గతంలో అదే జిల్లాలోని భైంసాలో ఆ పార్టీ మత ఉద్రికత్తలను రెచ్చగొట్టిన తీరు మనకు గుర్తే. ఇప్పుడు మరో కొత్త ప్రాంతమైన జైనూరులో కూడా అదే తరహాలో చిచ్చుపెట్టేందుకు, తద్వారా రాజకీయలబ్ధి పొందేందుకు కాషాయ పార్టీ చూస్తోంది. ఆయా ఘటనలను విచారించి, నిజా నిజాలను నిగ్గు తేల్చాల్సింది, బాధితులకు న్యాయం చేయాల్సింది, బాధ్యులను శిక్షించాల్సింది పోలీసులు, కోర్టులు. కానీ ధరలు, నిరుద్యోగం, పేదరికం, ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, సీజనల్ వ్యాధుల్లాంటి ప్రజల దైనందిన సమస్యల గురించి ఒక్కరోజు కూడా పట్టించుకోని బీజేపీ జైనూరు లాంటి ఘటనల్లో మాత్రం జోక్యం చేసుకోవటం అత్యంత విడ్డూరం. ఆయా విషయాల్లో ఒక రాజకీయ పార్టీగా అన్నింటికి మతం రంగు పులమటం, తద్వారా చిలువలు పలువలు చేయటం దానికే చెల్లింది. ఇక్కడ మనం ఒక విషయాన్ని సీరియస్గా గమనించాలి. గత కొన్నేండ్లుగా రాష్ట్రంతోపాటు దేశంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టు కోసం బీజేపీ అనేక రకాల ప్రయోగాలు చేస్తోంది. వనవాసీ కళ్యాణ పరిషత్ తదితర సంస్థల పేర్లతో వారిలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది, అలా ప్రయత్నించి కొన్నిచోట్ల సఫలీకతమైంది, ఫలితాలు సాధించింది. జైనూరుతో పాటు ఆ జిల్లాలోని అనేక గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో సరైన ఉపాధి అవకాశాల్లేకపోవటం సమస్యలకు ప్రధాన కారణం. దీంతో ఆదివాసీలు, ఇతర గిరిజనుల మధ్య పచ్చగడ్డేస్తే భగ్గుమంటోంది. ఈ పరిస్థితిని బీజేపీ తనకు అనుకూలంగా మలచుకుంది. ఆదివాసీలను రెండు వర్గాలుగా విడదీసి, వారిలో వారికి చిచ్చుపెట్టి, వారితో మైదాన ప్రాంత గిరిజనులకు గొడవలు సృష్టించి, నానా యాగీ చేస్తోంది. మరోవైపు జానీ మాస్టర్ వ్యవహారంపై కూడా రచ్చ చేసేందుకు బీజేపీ కాసుక్కూర్చుంది. ఈ అంశంపై ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు ఇక్కడ గమనార్హం. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నేటి కేంద్ర మంత్రి బండి సంజయ్ 'మసీదులన్నీ కూలుస్తాం' అంటూ ప్రమాదకరమైన కామెంట్లు చేయటం ఆ పార్టీ విద్వేష బీజాలకు పరాకాష్ట. 'శవాలు, శివలింగాలు' అంటూ ఆయన వ్యాఖ్యానించటాన్నిబట్టి తన పార్టీ 'ఉద్దేశమేంటో' చెప్పకనే చెప్పారు. బహుశా ఇలాంటి ప్రమాదాలను రాష్ట్ర మంత్రి సీతక్క ముందే పసిగట్టారు కాబోలు. మతతత్వ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. దుష్టశక్తులు పేట్రేగేందుకు అవకాశమివ్వొ ద్దంటూ జనాలను అప్రమత్తం చేశారు. అంతేకాదు నిజాం హయం నుంచి ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సఖ్యతగా మెలిగిన ఆదివాసీ, మైనారిటీ వర్గాల మధ్య విభేదాలు తలెత్తడం పట్ల విచారం వ్యక్తం చేస్తూనే ఇలాంటి సమస్యలను పైపైన చూడకూడదనీ, వాటి మూలాల్లోకి వెళ్లాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మైనారిటీల పట్ల యువతలో వ్యతిరేక భావనను పెంపొం దిస్తున్న దుష్ట శక్తులపట్ల కఠినంగా వ్యవహరించాలంటూ ఆమె ఆదేశించారు. ఇదే సమయంలో జైనూరు ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు త్వరలోనే ప్రభుత్వం తరపున ఒక ఉమ్మడి సమావేశాన్ని నిర్వహిస్తామంటూ ఆమె భరోసా నివ్వటం హర్షణీయం. అదే సమయంలో 'మైనారిటీ శక్తులు' కూడా హద్దు దాటితే 'చట్టం తన పని తాను చేసుకు పోతుంది' అని చెప్పటం ద్వారా మతతత్వ శక్తులకు ఎలాంటి అవకాశం, ఆస్కారం ఇవ్వకుండా చూడటం కూడా సరైందే. ఈ విషయంలో ఆదిలాబాద్ ఇంచార్జి మంత్రిగా సీతక్క చొరవను, కృషిని అభినందించి తీరాలి. అయితే ఆమె ప్రయత్నమొక్కటే ఇక్కడ సరిపోదు. ఇలాంటి సున్నిత అంశాలను పరిశీలించి, పరిష్కరించాల్సిన బాధ్యత నేటి రేవంత్ సర్కార్పై ఉంది. ప్రజల మధ్య చిచ్చుపెట్టే అరాచక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్న సంకేతాన్ని అది ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా పంపాలి. అప్పుడే ఏచూరి చెప్పిన మన పూల బొకే మరింత అందంగా కనబడుతుంది.

# డిపాజిట్ల సంక్షోభం





'బండికి రెండు చక్రాలు ఎలాగో బ్యాంకింగ్ రంగానికి డిపాజిట్లు, రుణాలు కూడా అటువంటివే. దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన బ్యాంకింగ్ రంగం సజావుగా సాగాలంటే డిపాజిట్లు, రుణాల నడక కూడా సక్రమంగా ఉండాలి.' కొద్ది రోజుల క్రితం రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ అన్న మాటలివి! బ్యాంకింగ్ రంగం డిపాజిట్ల సంక్షోభం ఎదుర్కుంటోందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో జరిగిన రిజర్వుబ్యాంకు బోర్డు సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని, డిపాజిట్లుగా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా ఇవ్వాలని చెప్పారు. ఈ సమావేశానికి హాజరైన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ డిపాజిట్ల సేకరణ కోసం ఆకర్షణీయమైన, వినూత్న పథకాలను ప్రవేశ పెట్టాలని చెప్పడంతో పాటు, మరికొన్ని సూచనలు చేశారు. రిజర్వుబ్యాంకు తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం జూన్ 2023 నాటికి మొత్తం దేశీయ డిపాజిట్లు 4.8 శాతం తగ్గినట్లు నివేదిక పేర్కొంది. 1995 తరువాత వార్షిక డిపాజిట్లలో ఈ స్థాయి తగ్గుదల నమోదు కావడం ఇదే మొదటిసారి. గత ఏడాది 43.5 శాతంగా ఉన్న కరెంటు అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (సిఎఎస్ఎ) డిపాజిట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 41 శాతానికి తగ్గాయి. ఇది దాదాపుగా కరోనా వ్యాప్తికి ముందున్న సంవత్సరాలకు సమానం! రిజర్వు బ్యాంకుతో పాటు ఎస్‌బిఐ నివేదిక కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. రానున్న రోజుల్లో ఈ క్షీణత మరింతగా కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ స్థాయిలో బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గడానికి దారితీసిన అసలైన కారణాలను రిజర్వుబ్యాంకు గానీ, ప్రభుత్వంగానీ గుర్తించిందా అన్నదే అసలైన ప్రశ్న! ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో (ఏప్రిల్ నెలలో) రిజర్వుబ్యాంకు విడుదల చేసిన నివేదిక ప్రకారమే మన దేశంలో పొదుపు గణనీయంగా పడిపోయింది. దేశంలోని కుటుంబాల నికర పొదుపు 47 ఏళ్ల కనిష్టానికి పడిపోయిందని ఆ నివేదికలో రిజర్వు బ్యాంకు పేర్కొంది. 2022లో దేశ జిడిపిలో 7.3 శాతంగా ఉన్న పొదుపు 2023లో 5.3 శాతానికి పడిపోయింది. బ్యాంకుల డిపాజిట్లతో పాటు స్టాక్స్‌ను కూడా పరిగణలోకి తీసుకుని ఈ పొదుపు లెక్కలను ఆర్‌బిఐ రూపొందించడం గమనార్హం. ఆ నివేదికలోనే కుటుంబాల అప్పులు గణనీయంగా పెరుగుతున్నాయని కూడా ఆర్‌బిఐ పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాల మొత్తం దేశ జిడిపిలో 5.8 శాతంగా ఉంది. 1970 తరువాత కుటుంబాల రుణం ఈ స్థాయిలో పెరగడం ఇది రెండోసారి! అప్పులు పెరిగితే కష్టపడి సంపాదించిందంతా దానిని తీర్చడానికే సరిపోతుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక పొదుపు చేయడానికి అవకాశం ఎక్కడిది? ఒకప్పుడు పొదుపు చేయడమంటేనే వివిధ దేశాల్లోనే ప్రజలు భారత్‌ను గుర్తుచేసుకునే వారు. చుక్కలను దాటి పరుగులు తీస్తున్న ధరలు ఆ పరిస్థితిని మార్చివేస్తున్నాయి. కనీస అవసరాలను తీర్చుకోవడానికే సామాన్యులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మార్కెట్ అధ్యయన సంస్థ కాంతర్ రెండు రోజుల క్రితం విడుదల చేసిన ఒక నివేదిక సామాన్యులపై ధరాఘాతం ఏ స్థాయిలో ఉందో తెలియచేస్తోంది. దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో ఈ సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం నిత్యావసరాల కోసం 2022వ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ (త్రైమాసికం)లో చేసిన ఖర్చు కంటే ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 18 శాతం అధికంగా భారతీయ కుటుంబాలు ఖర్చు చేశాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితులున్నాయని ఈ నివేదికలో పేర్కొన్నారు. ఈ కాలంలో ఔషధాల వ్యయం కూడా రెట్టింపైంది. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇంటి అద్దెలు వంటివి దీనికి అదనం! పెరిగిన ఖర్చులకు తగ్గట్టుగా ప్రజల నిజ వేతనాలు పెరగడం లేదన్నది సుస్పష్టం. కొంచెం అటుఇటుగా పట్టణ ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోనూ కొనసాగుతున్న ఈ పరిస్థితులను మార్చాలంటే ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. అధిక ధరలకు కళ్లెం వేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున కల్పించాలి. అప్పుడే ప్రజల చేతుల్లో డబ్బు ఉంటుంది. పొదుపు చేయడం సాధ్యమవుతుంది. ఈ చర్యలు తీసుకోకుండా వడ్డీ రేట్లను పెంచినా ఫలితం శూన్యం!

# కాదేదీ కల్తీకి అనర్హం



తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలు రాజకీయంగా, సామాజికంగా ప్రకంపనలు సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఏడుకొండల వాడి ప్రసాదం ఒక్కటే కాదు దేశంలో పాలు, జున్ను, పండ్లు, కూరగాయలు కూడా రసాయనాల కల్తీతో వినియోగదారులను అస్వస్థత పాలు చేసే సంఘటనలు తరచుగా జరుగుతున్నాయని వింటున్నాం. క్రిమి సంహారక మందులు, ఎరువులు అతిగా వాడడం వల్ల పంటలు, కూరగాయలు, పండ్లు విషతుల్యమవుతున్నాయని శాస్త్రవేత్తలు పదేపదే హెచ్చరిస్తున్నారు. మామిడి, బొప్పాయి వంటి పండ్లు, బెల్లం రంగు, రుచి రావడానికి రసాయనాలు వాడుతున్నారు. దీన్ని బట్టి కల్తీకి కాదేదీ అనర్హం అన్న సామెత సార్థకమవుతోంది. తిరుపతి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై మరింత శాస్త్రీయపరమైన దర్యాప్తు జరగాల్సి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఇటువంటి ప్రఖ్యాత క్షేత్రాల్లో ప్రసాదం లేదా ఆహార నాణ్యతను పరీక్షించే వ్యవస్థ ఏ విధంగా ఉంటోంది? నాణ్యతా ప్రమాణాలు ఉల్లంఘించినప్పుడు ఏ చర్యలు తీసుకుంటారు? రాష్ట్ర స్థాయిలో లేదా జాతీయ స్థాయిలో ఆహార కల్తీ నియంత్రణాధికారులు నాణ్యతను ఎలా పర్యవేక్షిస్తారు? ఇవన్నీ ఎదురయ్యే ప్రశ్నలు.. జాతీయ స్థాయిలో కల్తీ అన్నది వ్యవస్థీకృతమై పోతోంది. రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజన పథకం ఎంత విజయవంతంగా సాగుతున్నా కల్తీ కారణంగా ఒడిదుడుకులు తప్పడం లేదు. పౌల్ట్రీలో యాంటీబయోటిక్స్ ప్రభావం లేదా నీటిలో ఆర్సెనిక్, సీసం లోహాల మూలకాలు ఇవన్నీ ఆహారం నాణ్యతను దెబ్బతీస్తుంటాయి.



సుగంధ ద్రవ్యాలు, వంటకు వినియోగించే పాత్రలు కూడా చాలా వరకు కల్తీకి దోహదకాలుగా ఉంటున్నాయి. దేశంలో లెడ్ క్రొమేట్ రసాయన మూలకం ఎంతవరకు వ్యాపించిందో స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీ చేపట్టిన అధ్యయనం లో కొన్ని వాస్తవాలు బయటపడ్డాయి. దేశంలోని 17 నగరాల నుంచి నమూనాలు సేకరించి పరిశీలించగా దాదాపు అన్ని నమూనాల్లో 14% వరకు లెడ్ క్రొమేట్ లోహం అత్యధిక స్థాయిల్లో ఉన్నట్టు తేలింది. పాట్నా, గువాహటి, చెన్నై నగరాల్లో లెడ్ అవశేషాలు బాగా కనిపించాయి. ఇక పాడి పరిశ్రమలో కీలక పాత్ర వహించే కోఆపరేటివ్‌ల్లో సగానికి సగం అసంఘటిత కార్మికులే ఉంటారు. నెయ్యి వంటి పదార్థాలను ప్రాసెస్ చేసేది వీరే. 2016 లో పార్లమెంట్ వెల్లడించిన వివరాల ప్రకారం భారతీయులు ప్రతి ముగ్గురిలో ఇద్దరు వినియోగించే పాలలో డిటెర్జెంట్, కాస్టిక్ సోడా, యూరియా, పెయింట్ కల్తీలుగా ఉంటున్నాయని వెల్లడైంది. గత ఆగస్టులో పార్లమెంట్ అందించిన డేటా ప్రకారం 2022 23 లో పరీక్షించిన ఆహార పదార్థాల నమూనాల్లో కల్తీలు ఉన్నాయని బయటపడింది. ఆహార తనిఖీలు తరచుగా జరగక పోవడం, కల్తీని కనుక్కునే సిబ్బందిలేకపోవడం ఇవన్నీ యథేచ్ఛగా సాగడానికి దోహదమవుతున్నాయి. ఎక్కడైనా, ఏదైనా కల్తీ జరుగుతున్నట్టు తెలిస్తేనే దాడులు చేస్తుంటారు. ఆ ఆహారాన్ని సీజ్ చేస్తుంటారు. ఇటీవల మాగ్గీ మసాలా కేసు, ఈథలిన్ ఆక్సైడ్ కుంభకోణం వెలుగులోకి వచ్చాయి. అయితే ఏం జరిగిందో దాడులు ఎందుకు చేశారో ఎవరికీ తెలీదు. తిరుపతి లడ్డూ కల్తీ సంఘటన భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసినప్పటికీ ఆ ఒక్క క్షేత్రంలోనే ఇలా జరుగుతోందనీ, దీనితో విస్తృతమైన తనిఖీలు, శాస్త్రీయ పరిశోధనలు వల్ల దేశంలో కల్తీ కాటుకు అకస్మాత్తుగా బ్రేకులు పడిపోతాయని కూడా నమ్మలేం. ప్రజల్లో అవగాహనతో పాటు సరైన తనిఖీ వ్యవస్థ ఉన్నప్పుడే కొంతవరకు దీన్ని నివారించగలం. నెయ్యి కల్తీ గురించి కొన్ని క్షేత్రస్థాయి వాస్తవాలు ప్రస్తావించవలసి ఉంది. డైరీ పరిశ్రమలో ఒక కిలో నెయ్యి తయారీకి ఉత్పత్తి వ్యయం రూ. 550 వరకు అవుతుండగా, ఎవరో ఒకరు కల్తీ చేసిన నెయ్యిని కిలో రూ. 345 కే విక్రయిస్తున్నారు. దీని వల్ల వాస్తవంగా నాణ్యమైన నెయ్యి ని తయారు చేసే రైతు, కల్తీ వ్యాపారస్తునితో పోటీ పడలేకపోతున్నాడని ఇండియన్ డైరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రూపీందర్ సింగ్ శోధీ ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇప్పుడు తిరుపతి సంక్షోభం డైరీ ఉత్పత్తులపై వ్యతిరేక ప్రభావం చూపించినా మరోవైపు దీని వల్ల నాణ్యతను పాటించే ప్రముఖ వ్యాపార సంస్థలకు డిమాండ్ కూడా పెరుగుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముక్కూముఖం తెలియని బ్రాండ్ల పాలను, పాల ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి వినియోగదారులు వెనుకాడక తప్పదు. ఆలయాలు, గురుద్వారాలు వంటి ఆరాధనా వ్యవస్థలు తక్కువ ధరకు సరఫరా చేయడానికి సిద్ధపడే బిడ్డర్లను విడిచిపెట్టి, నాణ్యత కోసం ధర ఎక్కువైనా ప్రామాణికాలు పాటించే ప్రముఖ కంపెనీల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా నాణ్యత పాటించే అసలైన ఉత్పత్తిదారులకు మేలు జరుగుతుందని రూపీందర్ సింగ్ ఈ సందర్భంగా ఉదహరించడం గమనార్హం.